

యోగాసనం

ఎముకలే లేనట్లుగా.. శరీరాన్ని ఎటు పడితే అటు మెలితిప్పుతూ విద్యార్థులు ప్రదర్శించిన యోగా విన్యాసాలు సభికులను ఆశ్చర్య పరిచాయి. తిరుపతిలో జరిగిన ఐక్యతా ర్యాలీ సమావేశంలో యోగాసనాలు వేశారు.

- 8లో

శ్రీవారికి పుష్పాభిషేకం

అలంకార ప్రియుడైన శ్రీవారికి తిరుమలలో గురువారం పుష్పాభిషేకం నిర్వహించారు. దాదాపు తొమ్మిది టన్నుల పూలతో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పకు పుష్పార్చన చేశారు.





పాకాల మండలం ఒడ్డిపల్లెలో వరిపైరులోకి చేరిన వర్షపునీరు

మూడు రోజులపాటు ప్రజలను అవస్థలకు గురిచేసింది. అధికార యంత్రాంగాన్ని పరుగులు పెట్టించింది. వాతావరణ శాఖ హెచ్చరించిన స్థాయిలో తుఫాన్ తీవ్రత లేకున్నా నష్టాన్ని మాత్రం ఓ మాదిరిగా మిగిల్చింది. ఇలా జిల్లాలో మొంథా వల్ల కలిగిన నష్టం రూ.38.21 కోట్లుగా ప్రాథమిక అంచనాకు వచ్చారు. క్షేత్రస్థాయిలో నష్టం వివరాలను పరిశీలించి, బాధితులను గుర్తించడంలో అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారు.

ఆపద వీడింది నష్టం మిగిలింది

- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి



నారాయణవనం మండలం తుంబూరు వద్ద దెబ్బతిన్న కాజ్‌వే

- ప్రాథమిక నష్టం అంచనా రూ.38.21 కోట్లు
- వాస్తవానికి కావాల్సింది రూ.300 కోట్లకుపైనే
- వివరాల సేకరణలో పలుశాఖల జాప్యం

చేతికందిన పంట నేలమట్టం

తుఫాన్ వరి రైతులను వెన్ను విరిచింది. రేపో మాపో కోత కోసం పంటను అమ్ముకుని అప్పులు తీర్చుకుందామనే సమయంలో వరుస వర్షాలు, గాలుల ధాటికి చేతికి అందిన పంట నేలమట్టమైంది. అత్యధికంగా వరి 94 హెక్టార్లలో, వేరుశనగ 2 హెక్టార్లలో, కాకర, ఇతర ఉద్యానవన పంటలు 1.6హెక్టార్లలో దెబ్బతిన్నాయి.

విద్యుత్‌శాఖకు రూ.57లక్షల షాక్

బలమైన ఈదురుగాలులతో విద్యుత్‌శాఖకు రూ.57లక్షల నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా వేశారు. విద్యుత్ స్తంభాలను ఎప్పటికపుడు పునరుద్ధరించారు.తుఫాన్ ప్రభావిత సబ్‌స్టేషన్లు85, దెబ్బతిన్న స్తంభాలు 132, తెగిన విద్యుత్ తీగలు 4.55 కిలోమీటర్లు, పాడైన ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. విద్యుత్‌శాఖకు సుమారు 57.5లక్షలు నష్టం వాటిల్లింది.

నీటిపారుదలశాఖకు రూ.32 కోట్లు నష్టం

జిల్లాలో భారీ వర్షానికి సింహభాగం నీటిపారుదలశాఖకు వచ్చేసరికి రూ.32కోట్లు దెబ్బతిన్నాయి. జిల్లాలో చాలా చోట్ల చెరువులకు గండ్లు పడ్డాయి. కొన్నిచోట్ల గట్లు లీకయ్యాయి. ఇక మున్సిపల్‌శాఖకు రూ.18లక్షల మేర నష్టం వాటిల్లింది. ఓపెన్ డ్రైన్లు, ఈ తుఫాన్ వల్ల పశుసంవర్ధకశాఖకు రూ.14లక్షల నష్టం జరిగింది. దాదాపు 78 మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. ఇక తుఫాన్‌ధాటికి 24 ఇళ్లు దెబ్బతినగా పాక్షికంగా 12 ఇళ్లు దెబ్బతిన్నాయి. 16 పూరిగుడిసెలు దెబ్బతినగా రూ.13లక్షల నష్టం వాటిల్లింది. జిల్లాలో 19మండలాల్లో తుఫాన్ ధాటికి నష్టం వాటిల్లింది.

ఎందుకంత ఆలస్యం?

తుఫాన్ నష్ట అంచనా వివరాలను సేకరించడంలో జాప్యం జరుగుతోంది. మంగళవారం నాటికే జిల్లాలో వర్షాలు నిలిచినా బుధ, గురువారాల్లోనూ తుఫాన్ నష్టం అంచనా పూర్తి కాలేదు. కలెక్టర్ వెంకటేశ్వర్ క్షేత్రస్థాయిలో తిరిగి తుఫాన్‌నష్ట వివరాలను త్వరగా పంపాలని ఆదేశించినా, వీడియో కాన్ఫరెన్సు పెట్టి పదే పదే తెలిపినా కొన్నిశాఖల్లో తుఫాన్ నష్టాన్ని అంచనా వేయడంలో జాప్యం చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. దాదాపు తుఫాన్ ప్రభావం పోయి రెండు రోజులైనా 50శాతం కూడా జిల్లా అధికారులు నివేదికలు సిద్ధం చేయకపోవడం గమనార్హం.

దెబ్బతిన్న రోడ్లు

సాధారణ రోజుల్లో రోడ్లు తరచూ మరమ్మతులకు గురవుతుంటాయి. తుఫాన్ నేపథ్యంలో సుమారు ఐదు రోజులు జిల్లాలో వర్షాలు పడటంతో సుమారు 267 కిలోమీటర్లు దెబ్బతిన్నాయి. జిల్లా మొత్తంగా 112 రోడ్లు దెబ్బతిన్నాయి. ఆర్‌అండ్‌బీ పరిధిలో 42 రోడ్లు.. సుమారు 129 కిలోమీటర్ల దెబ్బతింది. ఇక పంచాయతీరాజ్‌శాఖకు సంబంధించి 70 రోడ్లు.. 138 కిలోమీటర్ల వరకు మరమ్మతులకు గురైంది. రెండు శాఖలకు కలిపి సుమారు రూ.5 కోట్ల మేర నష్టం వాటిల్లింది.

కావాల్సింది రూ.300 కోట్లు పైమాటే

ప్రాథమికంగా తుఫాన్ నష్టాన్ని రూ.38.21 కోట్లుగా అంచనా వేసినా, వాస్తవానికి రూ.300 కోట్లకుపైనే కావాల్సి ఉంటుందని అధికార యంత్రాంగం చెబుతోంది. ఉదాహరణకు ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్‌లో కిలోమీటరు రోడ్డు వేయడానికి రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షలు అవసరం. ఈ లెక్కన రెండు శాఖలకు సంబంధించి తాత్కాలిక మరమ్మతులకు కావాల్సింది రూ.40 కోట్లకుపైనే. కానీ, ఎన్డీఆర్ఎఫ్ నిబంధనల ప్రకారం కిలోమీటరుకు రూ.60-70వేలు చూపుతుంది. దీంతో రూ.5 కోట్ల వరకు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇక, జిల్లాలో దెబ్బతిన్న చెరువులకూ రూ.105 కోట్లు అవసరం. ఇలా అన్ని శాఖలు కలిపితే మరమ్మతులకు కావాల్సింది రూ.300 కోట్లు దాటుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. కాగా, కొన్ని శాఖల అధికారులు పూర్తిస్థాయి నష్ట వివరాలతో గురువారం రాత్రి కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ప్రజంటేషన్ ఇవ్వగా, ఇంకా పలు శాఖల నుంచి తీవ్ర జాప్యం జరుగుతోంది.

ఇసుక రీచ్‌లు, స్టాక్ యార్డుల గడువు పొడిగింపు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఇసుక రీచ్‌లు, యార్డుల అనుమతులు గడువు పొడిగిస్తూ జిల్లా స్థాయి ఇసుక కమిటీ ఛైర్మన్, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ సభ్యుల సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. నాగలాపురం మండలం కారణిలో సర్వే నెంబరు 162-2లో విష్ణువర్ధన రెడ్డి పట్టా భూమిలో అన్ని రకాల అనుమతులు ఉన్నందున అక్కడ్నుంచి 73,500 టన్నుల ఇసుక తవ్వుకునేందుకు అనుమతించారు. బైటకొడియంబేడులోని సర్వే నెంబరు 282-1,4లో 28,050 మెట్రిక్ టన్నులు, సూళ్లూరుపేట మండలం మంగానెల్లూరులో సర్వే నెంబరు 3-7బీ, 3-7బీ-2లోని 26,953 టన్నుల ఇసుకను తవ్వి తీసుకెళ్లడానికి అనుమతిచ్చారు. కారణిలోని సర్వే నెంబరు 159-1ఏ, 160-2, 3ఏ, 3బీ, 5బీలో ఇసుకను తవ్వి సరఫరాచేయడానికి.. సురుటుపల్లి ఆనకట్ట ఆరణియార్ నదిలో ఎస్ఎస్‌బీ పేటలో 99,000 టన్నుల ఇసుక, పాలచ్చూరు ఆనకట్ట గుడాలివద్ద అనుమతులు ఆగస్టుకు ముగిసినందున ప్రస్తుతం నిల్వ ఉన్న ఇసుకను సరఫరా చేయడానికి వచ్చే ఏడాది మార్చి వరకు అనుమతి ఇచ్చారు. గూడూరులో, భాకరాపేటలో ఇసుక స్టాక్ యార్డుల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేశారు.

రాకెట్ ప్రయోగ రిహార్సల్ విజయవంతం

సూళ్లూరుపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): షార్ నుంచి నవంబరు 2న సాయంత్రం 5.26 గంటలకు ఎల్వీఎం3-ఎం5 రాకెట్ ప్రయోగం జరగనుంది. ఈ ప్రయోగానికి ముందు చేపట్టే ప్రయోగ రిహార్సల్‌ను గురువారం శాస్త్రవేత్తలు విజయవంతంగా నిర్వహించారు. రిహార్సల్‌లో భాగంగా రాకెట్‌ను మొబైల్ సర్వీసు టవర్ నుంచి వెనక్కి తీసుకొచ్చి మళ్లీ తీసుకెళ్లే కార్యక్రమాన్ని విజయవంగా చేపట్టారు. ప్రయోగానికి సంబంధించిన మిషన్ రెడీనెస్ రివ్యూ సమావేశం (ఎంఆర్ఆర్) శుక్రవారం షార్‌లో జరగనుంది. ఈ సమావేశంలో శాస్త్రవేత్తలు సమావేశమై చర్చించి ఏవైన లోటు పాట్లు ఉంటేసరిచేసి ప్రయోగానికి సంసిద్ధత ఇస్తారు. ఎంఆర్ఆర్ అనంతరం షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ అధ్యక్షతన లాంచింగ్ ఆథరైజేషన్ బోర్డు (ల్యాబ్) సమావేశమై ప్రయోగాన్ని అధికారికంగా ప్రకటించి గ్రీన్ సిగ్నల్ ఇస్తారు. ప్రయోగ ఏర్పాట్లు చివరి దశకు చేరుకోవడంతో షార్‌లో సందడి నెలకొంది.

పోక్సో కేసులో జీవిత ఖైదు

వెంకటగిరిటౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలోని సర్వేపల్లి అంజయ్యకు పోక్సో కేసులో జీవిత ఖైదు, రూ.40వేలు జరిమానా విధిస్తూ నెల్లూరు కోర్టు జడ్జి సిరిపిరెడ్డి తీర్పునిచ్చారని సీఐ ఏవీ రమణ గురువారం తెలిపారు. మహిళలు, చిన్నారులపై అత్యాచారాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సాక్ష్యాధారాలు సేకరించి ఈ కేసులో నేర నిరూపణ చేసినట్లు తెలిపారు.

ఈ-బస్సు.. ఏసీ సూపర్ లగ్జరీ!

- పాత బస్సు కన్వర్షన్‌కు ముందుకొచ్చిన పూణె కంపెనీ
- ఈ ప్రయోగం సఫలమైతే సూపర్ లగ్జరీలన్నీ ఎలక్ట్రిక్ బస్సులే



రెట్రోఫిట్మెంట్ చేయనున్న సూపర్ లగ్జరీ బస్సు

పాత సూపర్ లగ్జరీ బస్సులను ఏం చేయాలి? పర్యావరణ హితం.. సంస్థకు లాభదాయకంగా ఎలా మార్చాలి? 'ఎలక్ట్రిక్ ఏసీ సూపర్ లగ్జరీలు'గా కన్వర్షన్ చేయడమే దీనికి పరిష్కారంగా అధికారులు ఓ నిర్ణయానికొచ్చారు. ఈ ప్రయోగం విజయవంతమైతే తక్కువ ఖర్చుతో ఎలక్ట్రిక్ ఏసీ సూపర్ లగ్జరీ బస్సులు మరిన్ని రోడ్డెక్కనున్నాయి.

- తిరుపతి(ఆర్టీసీ), ఆంధ్రజ్యోతి

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆర్టీసీపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రిక్ బస్సుల ఏర్పాటులో జిల్లాకు తొలి ప్రాధాన్యమిచ్చే కార్యాచరణ వేగవంతమైంది. ఇప్పటికే చిత్తూరులో గ్యాస్‌తో బస్సు నడిచేలా ప్రయోగాత్మకంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. అలాగే కుప్పండిపో నుంచి ఓ బస్సును ఎలక్ట్రిక్ విధానంలోకి మార్చేందుకు బెంగళూరు సంస్థను సంప్రదించారు. తిరుపతికి సంబంధించి రెట్రోఫిట్మెంట్‌కు పూణెకు చెందిన కల్యాణి పవర్‌ట్రైన్ లిమిటెడ్ సంస్థ ముందుకు రాగా వారం కిందటే ఎంవోయూ కుదుర్చుకున్నారు. దీంతో పాటు ఆర్టీవో ద్వారా కన్వెన్షన్ అనుమతి పొందారు. దీని కోసం ప్రస్తుతం పల్లెవెలుగు పేరుతో నడుస్తున్న సూపర్‌లగ్జరీ అశోక్ లేల్యాండ్ బస్సు (ఏపీ 03 జెడ్ 5473)ను ఎంపిక చేశారు. దీనిని అతి త్వరలోనే విజయవాడలోని కల్యాణి పవర్‌ట్రైన్ లిమిటెడ్ యూనిట్‌కు తీసుకెళ్లి అప్పగిస్తారు. ఆ తర్వాత 180రోజుల్లో ఫిట్మెంట్, బాడీఫ్యాబ్రికేషన్, టెస్టుట్రయల్ నిర్వహిస్తారు. ఈ టెస్ట్‌రన్ రిపోర్టుతో పూణెలోని ఆ సంస్థ ఆమోదం పొందుతారు. ఆపై 60 రోజులపాటు విజయవాడ లేదా తిరుపతిలో క్షేత్రస్థాయిలో టెస్ట్‌రన్ చేస్తారు. అది విజయవంతమైతే ఆర్టీవో ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేసి డీజిల్ ఎల్లో బోర్డు నుంచి గ్రీన్ బోర్డుకు మారుస్తారు. ఆ తర్వాత ప్రయాణికుల ఆదరణ ఉన్న రెగ్యులర్ రూట్‌ను ఎంపికచేసి కొన్ని రోజుల పాటు నడపతారు. ఆ తర్వాత దీనిపై ఉన్నతాధికారులు సమీక్షించి ఇలా మార్చడంతో ప్రయోజనం ఉందనుకుంటే మిగతా పాత సూపర్ లగ్జరీ బస్సులను ఇదే ప్రక్రియలోకి తీసుకురానున్నారు.

మార్పులు.. చేర్పులిలా

- పాత బస్సులో ప్రస్తుతమున్న ఇంజన్, గేర్‌బాక్సు, రేడియేటర్, ఎగ్జాస్టర్‌సిస్టమ్, డీజల్ ట్యాంకు తొలగిస్తారు. వాటి స్థానంలో బ్యాటరీలు, హెవీడ్యూటీ హేర్ కంప్రెషర్, బ్యాటరీ కూలింగ్ సిస్టమ్, పవర్ కన్వర్టర్లను అమరుస్తారు. చేసెస్ మినహా మిగిలిన అన్ని భాగాలు మారుస్తారు.
- 36సీట్ల సామర్థ్యంతో ఎలక్ట్రిక్ ఏసీ సూపర్ లగ్జరీ బస్సుగా మారుస్తారు.
- రూ.100 ఇంధనంతో ఐదు కిలోమీటర్లు నడిచే బస్సు. రెట్రోఫిట్మెంట్ ద్వారా రూ.50 విద్యుత్, ఇతర ఖర్చులతో ఐదు కిలోమీటర్లకుపైగా నడుస్తుంది.
- ఆర్టీసీకి సగం ఖర్చుల భారం తగ్గుతుంది.
- ఎలక్ట్రిక్ బస్సు కావడం వల్ల కాలుష్యం, శబ్దం లేకుండా పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుంది.
- బ్యాటరీ చార్జింగ్ పూర్తయితే 140 నుంచి 150 కిలోమీటర్లు ఏసీతో ప్రయాణిస్తుంది.

నమూనా 'ఎలక్ట్రిక్ ఏసీ సూపర్ లగ్జరీ' బస్సు





ముంపు ప్రాంత ప్రజలకు ఆలు, ఎర్రగడ్డలు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో పునరావాస కేంద్రాల నుంచి ఇళ్లకు వెళ్లే వరద బాధితులకు పంపిణీ చేయడానికి ఆలుగడ్డలు, ఎర్రగడ్డలను సిద్ధం చేస్తున్నారు. కిలో చొప్పున ప్యాకింగ్ చేస్తున్నారు. తిరుచానూరు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మౌనిక, కార్యదర్శి జానకిరామ్, పాలకవర్గంతో పాటు అధికారులు గురువారం 8 టన్నుల ఉల్లిపాయలు, ఆలుగడ్డలను ప్యాకింగ్ చేసి తీర ప్రాంత మండలాలకు పంపారు.

ర్యాపిడ్ కిట్లు వచ్చేశాయ్

- రేషన్ బియ్యం అక్రమ రవాణాకు చెక్ పెట్టే అవకాశం



తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పేదలకు చెందాల్సిన ఉచిత రేషన్ బియ్యాన్ని కొందరు పక్కదారి పట్టిస్తున్నారు.పాలిష్ చేసి మార్కెట్లో అత్యధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీనికి చెక్‌పెట్టే దిశగా ప్రభుత్వం అత్యాధునిక విధానానికి శ్రీకారం చుట్టింది. రేషన్ బియ్యం అక్రమ రవాణాను శీఘ్రమైనంత త్వరగా కట్టడిచేసేలా చర్యలు చేపట్టింది. తిరుపతి సహా పలు ప్రాంతల్లో నగరంలో రెండు నెలలకు ఒకసారి కొందరు మహిళలు వచ్చి కిలో రూ.10 నుంచి రూ 12 వంతున రేషన్ బియ్యం కొంటున్నారు. వీటిని మిల్లర్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా లక్షలాది రూపాయల పేదల బియ్యం మిల్లర్లకు చేరి పాలిష్‌గా మారి.. మార్కెట్లోకి వస్తున్నాయి. అక్రమ రవాణాపై గతంలో అధికారులు తనిఖీ చేసినా.. ఆ బియ్యం రేషన్ షాపువేనని అనుమానిస్తే వాటిని ల్యాబ్‌కు పంపేవారు. పరీక్షలు చేశాకే రేషన్ బియ్యంపై నిర్ధారణకు వచ్చేవారు. ఆ తర్వాత చర్యలు తీసుకునేవారు. ఈ ప్రక్రియ ఆలస్యమయ్యేది. మరిప్పుడు వెంటనే రేషన్ బియ్యాన్ని గుర్తించేలా జిల్లాకు 30 రాపిడ్ కిట్లు పంపింది. వీటిని తిరుపతి నగరం, రూరల్, శ్రీకాళహస్తి, చంద్రగిరి, నాయుడుపేట ప్రాంతాలకు కేటాయించారు. ఈ కిట్లలో పొటాషియం థయో సైనైడ్, హైడ్రో క్లోరిక్ యాసిడ్ ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఫోర్టిఫైడ్ రైస్ అయితే.. ఈ ద్రావణాలను ఆ బియ్యంపై చల్లిన వెంటనే ఎరుపు రంగుకు మారతాయి. బయట దుకాణాల్లో విక్రయించే బియ్యమైతే రంగు మారవు. ఆ వెంటనే బియ్యాన్ని సీజ్ చేయడానికి వీలవుతుంది. ఎక్కడైనా అనుమానాలుంటే ఈ కిట్లతో పరీక్షిస్తే అది రేషన్ బియ్యమా కాదా అనేది క్షణాల్లో తేలిపోతుంది. ఇలా అక్రమ రవాణాకు చెక్ పెట్టేదిశగా ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుంది.

ఆర్టీసీలో ఆనందమానందమాయె

- 705మంది ఉద్యోగులకు పదోన్నతి

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఆరేళ్లుగా ఎదురు చూస్తున్న ఆర్టీసీ ఉద్యోగుల కలనెరవేరసంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 705 మందికి పదోన్నతి లభించింది. పదోన్నతులు పొందిన వారి జాబితా శుక్ర లేదా శనివారాల్లో డీపీటీవో జగదీష్ ప్రకటించనున్నారు. 281 మంది గ్రేడ్-1 డ్రైవర్లుగా,130మంది గ్రేడ్-1 కండక్టర్లుగా,111మంది ఏడీసీ టెక్నికల్ కంట్రోలర్‌గా,46మంది డీసీలుగా,28మంది ఎల్‌హెచ్‌లుగా,45మంది గ్రేడ్ 1 మెకానికల్‌గా,6మంది గ్రేడ్ 1టిమ్మర్లుగా,8మంది గ్రేడ్ 1పెయింటర్లుగా,4మంది గ్రేడ్ 1 వెల్డర్లుగా,6మంది గ్రేడ్ 1బ్లాక్‌స్మిత్‌గా,8మంది హమ్మర్‌మెన్స్‌గా.32మంది డిప్యూటీ మెకానికల్స్‌గా పదోన్నతి పొందినట్లు సమాచారం. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 15 డిపోల్లో దాదాపు 6వేలమంది పనిచేస్తున్నారు. వీరిలో ఒకేసారి 705మందికి పదోన్నతి లభించడంపై ఉద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. గత వైసీపీ ప్రభుత్వ విధానాలతో దాదాపు వంద మంది పదోన్నతి పొందకుండానే రిటైరయ్యారని ఈ సందర్భంగా ఉద్యోగులు గుర్తు చేసుకుంటున్నారు. ప్రమోషన్ పొందిన వారికి మరోచోట పోస్టింగ్ ఇచ్చే అవకాశముంది. దీంతో కొన్ని ఖాళీలు ఏర్పడతాయని ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి.

వ్యర్థాల తొలగింపునకు శ్రీకారం


ఏపుగా పెరిగిన కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది

చంద్రగిరి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ముక్కోటి సమీపాన స్వర్ణముఖి నది వంతెన వద్ద వరద వల్ల పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపునకు ఆర్ అండ్‌బీ అధికారులు గురువారం శ్రీకారం చుట్టా రు. తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు స్వర్ణముఖినది జోరుగా ప్రవహిస్తోంది. దీంతో చెత్తాచెదారం వంతెన వద్ద నిలిచిపోతోంది. ఆర్‌అండ్‌బీ డీఈఈ శ్రీనివాసులు, ఏఈఈ అజిత్‌కుమార్ ఆధ్వర్యంలో జేసీబీ యంత్ర సాయంతో ముళ్ళ కంపలను తొలగించి, చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్తీక మాసం సందర్భంగా ముక్కోటిలోని అగస్త్యేశ్వరాలయానికి భక్తులు నిత్యం వస్తుంటారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా వంతెన రోడ్డుకు ఇరువైపులా శుభ్రపరిచారు.

కన్నయ్య యాదవ్ మృతికి సంతాపం



చంద్రగిరి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నరసింగాపురం గ్రామానికి చెందిన చంద్రగిరి రైల్వే స్టేషన్ అభివృద్ధి కమిటీ మెంబర్ కన్నయ్యయాదవ్ గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. ఈయన రైల్వేలో పని చేసి రిటైరయ్యారు. ఈయన్ను చంద్రగిరి రైల్వే స్టేషన్ అభివృద్ధి కమిటీ మెంబర్‌గా నియమితులైన కన్నయ్య చంద్రగిరి రైల్వే స్టేషన్ అభివృద్ధికి తనవంతు కృషి చేశారు. బీజేపీ నాయకులు, కమిటీ సభ్యులు నరేష్‌కుమార్‌నాయుడు, జమ్మాల ధర్మవేణి, దొరస్వామిలు ఆయన మృత దేహానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు.

కాగ్నిజెంట్‌కు ఎంబీయూ విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో వర్సిటీ అధికారులు

చంద్రగిరి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో 253 మంది విద్యార్థులు గురువారం కాగ్నిజెంట్ టెక్నాలజీ సర్వీసుకు ఎంపికయ్యారు. ఈవిద్యార్థులకు సంవత్సరానికి రూ.4 లక్షల నుంచి రూ.6.75 లక్షలు వరకు వేతన ప్యాకేజీ లభించిందని కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ డిల్లీబాబు తెలిపారు. ఎంబీయూ ఛాన్సలర్ డాక్టర్ ఎం.మోహన్‌బాబు, ప్రోఛాన్సలర్ మంచు విష్ణు వర్ధన్‌బాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, వైస్‌ఛాన్సలర్ డాక్టర్ నాగరాజ్‌రామ్‌రావులు ఎంపిఐన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎంబీయూ రిజిస్ట్రార్ డాక్టర్ సారథి, ఫైనాన్స్ డైరెక్టర్ రవిశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణ వెంకన్న పుష్పయాగం



తిరుపతిరూరల్, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంటలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం శ్రవణానక్షత్రాన్ని పురస్కరించుకుని గురువారం పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. 14రకాల పుష్పాలు, 6రకాల పత్రాలతో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామివారికి వేడుకగా పుష్పార్చన నిర్వహించారు. మాడ వీధులలో ఊరేగింపుగా బయలుదేరిన స్వామి, అమ్మవార్లు భక్తులను అనుగ్రహించారు. చెవిరెడ్డి లక్ష్మి, రఘునాథరెడ్డి, మంజుల దంపతులు, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నీట మునిగిన వరి రక్షణకు సూచనలు


నీట మునిగిన వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

రామచంద్రాపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఆధిక వర్షాల్లో వరిపంటను కాపాడుకునే మెలకువలను తెలుసుకోవాలని వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు మహేశ్వరరెడ్డి, విశ్వనాథ్, డాక్టర్ సుమతి, హారతిలు సూచించారు. మిట్టూరు, నడవలూరులో దెబ్బతిన్న వరిపంటలను గురవారం వారు పరిశీలించారు. సుమతి మాట్లాడుతూ కోతకు సిద్ధంగా ఉన్న వరిపంటను వర్షాలకు ముందు కోయరాదన్నారు. కోసినా పూర్తిగా ఆరని కంకులను కుప్పలు వేసే సమయంలో ఎకరాకు 25కిలోల ఉప్పును పనలపై చల్లి కుప్ప వేయాలన్నారు. దీనివల్ల నష్టాన్ని తగ్గించుకోవచ్చన్నారు. పొలంలో నీరునిలిచి ఉంటే పనలను గట్లపైకి చేర్చి విడగొట్టి ఉప్పు ద్రావణం చల్లాలన్నారు. వర్షాలు తగ్గి ఎండ రాగానే తిరగేసి ఆరబెట్టాలన్నారు. రైతులు మరిన్ని వివరాలకు 8331057819, 9866021755 నంబ్లను సంప్రదించాలన్నారు.

కాలు బయట పెట్టాలంటే కష్టమే..!


కుంట్రపాకంలో జల దిగ్బంధమైన ఇల్లు

తిరుపతిరూరల్, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): కుంట్రపాకం పంచాయతీల్లో ఓ ఇంటి చుట్టూ వర్షపు నీరు చేరింది. తుఫాన్ ప్రభావంతో గ్రామచెరువు, పెద్దకాలువ నీరు అటుగా ప్రవహించి ంది. .గ్రామస్తులు చొరవచూపి మోటారుతో నీరు బయటకు పంపినా పొల్లాల్లో ఊటనీరు వల్ల పూర్తిస్థాయిలో సమస్య పరిష్కారం కాలేదు. రెండ్రోలు ఎండవస్తే నీరు తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు.

శాస్త్రోక్తంగా ప్రసన్న వెంకటేశ్వరుడి కల్యాణం



వడమాలపేట, అక్టో బరు 30(ఆంధ్రజ్యోతి): అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వరుని ఆలయంలో గురు వారం శ్రీవారి కల్యాణో త్సవం శాస్త్రోక్తంగా వేదమంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. శ్రీవారి జన్మ నక్షత్ర మైన శ్రవణం సందర్భంగా కల్యాణం నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. పద్మావతి, ఆండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామివారిని పట్టు పీతాంబరాలు, పుష్పాలతో అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు సూర్య కుమారాచార్యుల ఆధ్వర్యంలో గణపతి, అగ్నిహోమం నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, భక్తుల గోవింద నామ స్మరణల నడుమ వేదమంత్రాలతో మంగళ్యధారణ చేయించారు. మహామంగళ హారతులిచ్చారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పట్టపగలే బంగారు నగల చోరీ


పగులగొట్టిన చెక్క బీరు

పాకాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆదెనపల్లె పంచాయతీ శంఖంపల్లె జాతీయ రహదారి పక్కన ఓ ఇంట్లో పట్టపగలే చోరీ జరిగింది. గురువారం ఉదయం 9 గంటలకు శంఖంపల్లెకు చెందిన బొల్లినేని వసంతమ్మ ఇంటికి తాళం వేసుకొని తిరుపతి వెళ్లింది. మధ్యాహ్నం 3 గంటలకు ఇంటికి వచ్చింది. ఇంటి సేఫ్టీ గేటు తాళాలు పగులగొట్టినట్లు ఉండటం గుర్తించింది. మెయిన్ డోర్ తాళాలు తీసి చూడగా ఇంటి కిటికీ గ్రిల్స్ కట్ చేసినట్టు ఉంది. దొంగలు చెక్కబీరువాను పగులగొట్టి ఎనిమిది నవరాల బంగారు నగలు, కొన్ని వస్తువులు తీసుకెళ్లిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరకతశక్తి కాళీ సేవలో మాజీ మంత్రి పితాని


సిద్ధేశ్వరానందభారతి స్వామి వద్ద ఆశీర్వచనం తీసుకుంటున్న పితాని సత్యనారాయణ

రామచంద్రాపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాయలచెరువుకట్ట శక్తిపీఠంలో ని మరకతశక్తికాళీ అమ్మవారిని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ దంపతులు గురువారం దర్శించుకున్నారు. వీరికి పూర్ణకుంభ స్వాగతం పలికి అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు. కుర్తాళం పీఠాధిపతి సిద్దేశ్వరానంద భారతిస్వామి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతిలను కలిసి కలిసి ఆశీర్వాదంపొందారు. హోమంలో పాల్గొన్నారు.

దక్షిణామూర్తికి తిరుమంజనం

రామచంద్రాపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాయలచెరువుకట్ట భవానీ జలకంఠేశ్వర ఉపాలయంలో మేధా దక్షిణామూర్తి స్వామివారికి ఆలయ అర్చకులు గురువారం శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణచేపట్టారు. ఆలయ నిర్వాహకులు తంజావూరు మురళీకృష్ణ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆటో ఢీకొని ఒకరి మృతి


మృతిచెందిన వెంకట రమణయ్య

రేణిగుంట అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆటో ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. అర్బన్ పోలీస్ స్టేషన్ రైటర్ చలపతి కథనం మేరకు.. గురువారం ఉదయం శ్రీకాళహస్తి మండలం కలవగుంట ఎస్టీ కాలనీకి చెందిన వెంకటరమణయ్య (38) తన స్నేహితుడు గంగాధరంతో కలిసి ద్విచక్ర వాహ నంలో వెళుతుండగా వేదాలచెరువు జాతీయ రహదారిపై వెళ తుండగా వెనుక నుంచి వచ్చిన ఆటోఢీకొంది. వెంకటరమణ య్యకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆస్ప త్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మధ్యాహ్నం మృతిచెందాడు. కేసు నమోదు చేశారు.

నిర్మాణ పనుల్లో వేగం పెంచండి

● రైల్వే డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా


రైల్వేస్టేషన్‌లో నూతన భవనాన్ని తనిఖీ చేస్తున్న డీఆర్‌ఎం

తిరుపతి(సెంట్రల్), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనుల్లో వేగం పెంచాలని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ మేనేజరు చంద్రశేఖర్ గుప్తా ఆదేశించారు. గురువారం ఆయన తిరుపతి రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న నిర్మాణ పనులను తనిఖీ చేశారు. దక్షిణం వైపు నిర్మిస్తున్న భవనంలో రన్నింగ్ స్టాఫ్, ప్రయాణికుల కోసం నిర్మించిన గదుల్లో మౌలిక వసతులను పరిశీలించారు. నిర్ణీత సమయానికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్టాల్స్ నిర్వహణ గురించి క్షేత్రస్థాయి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీఈ సూర్య నారాయణ, అధికారులు యూ.సుధాకర్, శ్రావణ్ కుమార్, మణికంఠ, మనోజ్‌కుమార్, స్టేషన్ మేనేజరు కె.చిన్నపరెడ్డి, దరూరు ప్రభాకర్, మాధవరావు, ఐపీఎఫ్ సందీప్‌కుమార్ ఆయన వెంట ఉన్నారు. అనంతరం రేణిగుంట రైల్వేస్టేషన్ లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు.

గోతిలో ఒరిగిన సిమెంట్ లారీ

● తృటిలో తప్పిన ప్రమాదం

కోట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కోట పట్టణ పరిధిలోని చల్లకాలువ వంతెన వద్ద గురువారం ఫైబర్ కేబుల్ కోసం తవ్విన గుంతలోపడి సిమెంట్ లారీ వాలిపోయింది. గూడూరు నుంచి సిమెంట్ లోడ్‌తో లారీ కోటకు వస్తూ చల్లకాలువ వంతెన గోతుల్లో ప్రమాదవశాత్తు ముందు చక్రాలు దిగబడిపోవడంతో ఒక్కసారిగా వాలిపోయింది. డ్రైవర్, క్లీనర్ చాకచక్యంగా బయటకు దూకేయడంతో పెను ప్రమాదం తప్పింది.

పోక్సో కేసులో 20 ఏళ్ల జైలు, జరిమానా

చిత్తూరు లీగల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):పోక్సో కేసులో అన్నమయ్య జిల్లా యువకుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ చిత్తూరు న్యాయస్థానం తీర్పు చెప్పింది. పీటీఎం మండలం మద్దయ్యగారిపల్లెకు చెందిన నరేంద్రరెడ్డి ఓ బాలికను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు.బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో పీటీఎం పోలీసులు 2023 నవంబరు 29న కేసు నమోదు చేసి నరేంద్రరెడ్డిని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు గురువారం చిత్తూరు కోర్టు ఆవరణలో ఉన్న పోక్సో కోర్టులో విచారణకు వచ్చింది.నేరం రుజువుకావడంతో పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి శంకర్‌రావు ముద్దాయి నరేంద్రరెడ్డికి 20 ఏళ్ల జైలుశిక్ష, రూ. 10వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. అలాగే బాధితురాలికి రూ. లక్ష నష్టపరిహారాన్ని చెల్లించాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ కేసును స్పెషల్ పీపీ మోహనకుమారి వాదించారు.

పుదిపట్ల..ఇలా ఉంటే ఎట్లా?




చంద్రగిరి వెళ్లే మార్గంలో వర్షపునీరు-నివాసాల మధ్య నిల్వ నీరు-మట్టిరోడ్డులో ఇబ్బందికరంగా మారిన గుంతలు

తిరుపతి రూరల్, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి రహదారిని ఆనుకుని ఉన్న పుదిపట్ల ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. పలు చోట భారీ గుంతలు ఏర్పడ్డాయి. వీధుల్లో ఇప్పటికీ మట్టిరోడ్డులే. రోడ్ల గుంతలో ఇటీవల వర్షపు నీరు చేరి స్థానికులు అవస్థలు పడుతున్నారు. నివాసాల మధ్య ఖాళీస్థలాల్లో కూడా ఇదే పరిస్థితి. దోమలబెడద అధికంగా ఉందని వాపోతున్నారు. వర్షపునీరు ఎక్కువరోజులు నిల్వ ఉండటంతో నాచు తరహాలో పచ్చగా మారుతోంది. ఇందులో డ్రైనేజీనీరు కలిసి దుర్వాసన వెదజల్లుతోంది.

యూడీసీ కొన్ని వీధులకే పరిమితం. మిగిలినచోట సరైన డ్రైనేజీవ్యవస్థ లేదు. గ్రామ ముఖద్వారమార్గంలో రోడ్డుపక్కన పేడదిబ్బలతో దుర్గంధం వెదజల్లుతోంది. ఈ వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. చంద్రగిరి రహదారిని ఆనుకుని గాంధీపురం మీదుగా పైనుంచి వచ్చే నీరునిల్వ చేరుతోంది. ఇది ముందుకు కదలకుండా నిలిచిపోతోందని ఈవీధిలో ఉంటున్న వారు ఆవేదన చెందుతున్నారు.

వెటర్నరీ కళాశాల ఏడీకి అత్యుత్తమ పురస్కారం



అవార్డు అందుకుంటున్న జగపతిరామయ్య

తిరుపతిరూరల్, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ పి.జగపతిరామయ్యకు అత్యుత్తమ అనాటమిస్ట్ అవార్డు లభించింది. జబల్‌పూర్‌లో జరుగుతున్న 39వ జాతీయ అనాటమి సదస్సులో 2025 సంవత్సరానికిగాను ప్రతిష్టాత్మక డాక్టర్ వీఆర్ బాంబుకార్ సిల్వర్‌జూబ్లీ అనాటమిస్ట్ అవార్డును నానాజీ దేశ్‌ముఖ్ వెటర్నరీ సైన్స్ వీసీ చేతుల మీదుగా అందుకున్నట్లు పేర్కొన్నారు. కాగా ఈయన్ను ఇండియన్ జర్నల్ ఆఫ్ వెటర్నరీ అనాటమికి చీఫ్ ఎడిటర్‌గా ఎన్నుకున్నారు. మూడేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. అధ్యాపకులు, ప్రొఫెసర్లు, వర్సిటీ ఆఫీసర్లు, ఉద్యోగులు అభినందించారు.

వైభవంగా త్రైమాసిక మెట్లోత్సవం


ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు


ఆధ్యాత్మిక సంగీత విభావరిలో భక్తి గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

తిరుమల, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): త్రైమాసిక మెట్లోత్సవంలో భాగంగా గురువారం ఆస్థానమండపంలో టీటీడీ దాససాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.ప్రాజెక్ట్ ప్రత్యేక అధికారి ఆనంద తీర్థాచార్యులు స్వామివారి వైభవం, మెట్లోత్సవం విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం నామసంకీర్తన, సామూహిక భజన, హరిదాసుల ఉపదేశాలు, సంగీత విభావరి ఆధ్యాత్మిక భావనలను నింపాయి. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం 4.30 గంటలకు అలిపిరి పాదాల మండపం నుంచి త్రైమాసిక మెట్లోత్సవం ప్రారంభం కానుంది.

శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకుని వివిధ శైవక్షేత్రాలను సందర్శించే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ఆధ్వర్యంలో అల్ట్రాడీలెక్స్ బస్సు ఏర్పాటు చేసినట్లు తిరుపతి డిపో మేనేజర్ సురేంద్రకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాళహస్తి, తలకోన, గుడిమల్లం, మహానంది, శ్రీశైలం, యాగంటి, పంచరామ క్షేత్రాలు, తిరువణ్ణామలై ఆలయాల సందర్శనకు వచ్చే మూడు సోమవారాలలో ఈ ప్రత్యేక బస్సులు నడుపుతామని తెలిపారు. శుక్రవారం ఆన్‌లైన్‌లో ఉంచుతామని, అడ్వాన్సు రిజర్వేషన్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7382881507, 8919188133లను సంప్రదించాలని కోరారు.

వేడుకగా శ్రవణోత్సవం



నారాయణవనం, అక్టోబరు 30 (ఆంధ్ర జ్యోతి): నారాయణవనంలో పద్మావతీ సమేత కళ్యాణ వెంకటేశ్వరుడి ఆలయంలో గురువారం సాయంత్రం ఉభయ నాంచారులతో కల్యాణ వెంకన్న తిరుచ్చి వాహనంలో మాడవీధుల్లో విహరించారు. ఉదయం స్వామి, అమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యపూజలు నిర్వహించారు. ప్రత్యేక పుష్పాలతో, స్వర్ణాభర ణాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణం సందర్భంగా ప్రత్యేక అర్చనలు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్నతిరుచ్చి వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. అధికారి నాగరాజు అర్చకులు శ్రీధర్ భట్టాచార్యులు, శ్రీనివాస భట్టాచార్యులు పాల్గొన్నారు.

3న ఆర్టీసీ వైద్యశాల ప్రారంభం

తిరుపతి(ఆర్టీసీ), అక్టోంబరు 30 (ఆంధ్రజ్యోతి): అలిపిరి రోడ్డులో నూతనంగా నిర్మించిన ఆర్టీసీ వైద్యశాలను నవంబర్ 3వ తేదీన ప్రారంభించనున్నారు. ఈ నెల 30న ప్రారంభించాల్సి ఉండగా మొంథా తుఫాన్ కారణంగా వాయిదా వేశారు. 3న రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించేలా డీపీటీవో జగదీష్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

నియోజకవర్గమంతా ఒకే డివిజనులో...

● కసరత్తు చేస్తున్న ప్రభుత్వం

చిత్తూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇక నుంచి నియోజకవర్గమంతా ఒకే రెవెన్యూ డివిజనులో ఉండేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఒకే రెవెన్యూ డివిజన్ కింద ఒకటికి మించి నియోజకవర్గాలు.. ఒకే నియోజకవర్గంలోని మండలాలు కొన్ని ఒక డివిజనులో.. మరికొన్ని ఇంకో డివిజనులో వుండడంతో ఇబ్బందులు తలెత్తున్నాయి. దీంతో నియోజకవర్గం పూర్తిగా ఒకే డివిజన్ పరిధిలో ఉండేలా కూటమి ప్రభుత్వం మార్పులు తీసుకురానుంది. చిత్తూరు జిల్లాలో కూడా ఆ మేరకు మార్పులు చేర్పులు ఉండనున్నాయి.

ఏ డివిజన్లో ఏయే మండలాలు..

జిల్లాల విభజనకు ముందు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చిత్తూరు, తిరుపతి, మదనపల్లె రెవెన్యూ డివిజన్లు మాత్రమే ఉండేవి. విభజన తర్వాత చిత్తూరు పరిధిలో పలమనేరు, కుప్పం, నగరి కేంద్రాలను.. తిరుపతి ప్రాంతంలో శ్రీకాళహస్తిని రెవెన్యూ డివిజన్లుగా ఏర్పాటు చేశారు. కుప్పం డివిజన్‌లో ఆ నియోజవర్గంలోని నాలుగు మండలాలను, పలమనేరు డివిజన్‌లో అక్కడి ఐదు మండలాలతో పాటు పుంగనూరులోని నాలుగు, పూతలపట్టులోని ఓ మండలాన్ని జత చేశారు. నగరి కేంద్రంలో చిత్తూరు జిల్లా పరిధిలో ఉన్న మూడు మండలాలతో పాటు, జీడీనెల్లూరులోని రెండు మండలాలను చేర్చారు. ఇలా.. జిల్లా చిన్నదైనా ఏకంగా నాలుగు చిన్న చిన్న రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేశారు.

వీటికి ఏ సమస్యా ఉండదు

ప్రభుత్వం అనుకున్న ప్రామాణికం మేరకు చూసుకుంటే కుప్పం, పలమనేరు, చిత్తూరు నియోజకవర్గాల్లోని మండలాలకు ఎలాంటి సమస్యా ఉండదు. ఎందుకంటే ఆయా నియోజకవర్గాల్లోని మండలాలన్నీ అక్కడ ఒకే రెవెన్యూ డివిజన్లలో ఉన్నాయి. ఉదాహరణకు కుప్పం నియోజకవర్గంలో నాలుగు మండలాలు కుప్పంలో, పలమనేరు నియోజకవర్గంలో ఐదు మండలాలు పలమనేరులో, చిత్తూరు నియోజకవర్గంలో మూడు మండలాలు చిత్తూరు డివిజన్లోనే ఉన్నాయి. కానీ, పుంగనూరు, పూతలపట్టు, జీడీనెల్లూరు, నగరి నియోజకవర్గాలు డిస్టర్బ్ అవుతాయి.

నగరి వెళ్లినా.. నాలుగు డివిజన్‌లే..

ప్రభుత్వం తీసుకున్న ప్రామాణికాన్ని బట్టి ఇక నుంచి పూతలపట్టు, జీడీనెల్లూరు నియోజకవర్గాలు పూర్తిగా ఒకే డివిజన్లో, అంటే చిత్తూరులో ఉండనున్నాయి. నగరి మూడు మండలాలతో సహా నగరి డివిజన్ తిరుపతి జిల్లాలోకి వెళ్లిపోతుండడంతో.. నగరిలో ఐదు మండలాలూ ఒకే డివిజన్ కింద ఉంటాయి. మొత్తంగా జిల్లాలోని నగరి డివిజన్ తిరుపతిలోకి వెళ్లిపోతే, పుంగనూరు డివిజన్ కొత్తగా ఏర్పడుతుంది. అంటే మళ్లీ చిత్తూరు జిల్లాలో నాలుగు రెవెన్యూ డివిజన్లు ఉంటాయి.

ఏ నియోజకవర్గం.. ఏ డివిజన్‌లోకి..!

● ప్రస్తుతం పుంగనూరు నియోజకవర్గంలో ఆరు మండలాలుండగా.. రొంపిచెర్ల, పులిచెర్ల మండలాలు చిత్తూరు డివిజన్లో.. మిగిలిన నాలుగు పలమనేరు డివిజన్లో ఉన్నాయి. ఇక నుంచి పుంగనూరునే రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటుచేసి ఆరు మండలాలనూ దాని పరిధిలోకి తీసుకురానున్నారు.


● పూతలపట్టు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో బంగారుపాళ్యం ఒకటే పలమనేరు డివిజన్లో ఉంది. మిగిలిన నాలుగు మండలాలు చిత్తూరు పరిధిలో ఉన్నాయి. ఇక నుంచి అన్ని మండలాలూ చిత్తూరు డివిజన్‌లోనే ఉండనున్నాయి.

● జీడీనెల్లూరు నియోజకవర్గంలో ఆరు మండలాలుండగా.. పాలసముద్రం, కార్వేటినగరం మండలాలు కొత్తగా ఏర్పడిన నగరి డివిజన్లో ఉన్నాయి. మిగిలిన నాలుగు మండలాలు చిత్తూరు డివిజన్‌నే కొనసాగుతున్నాయి.


● నగరి నియోజకవర్గంలో ఐదు మండలాల్లో నగరి, విజయపురం, నింద్ర నగరి డివిజన్లో ఉండగా. వడమాలపేట, పుత్తూరు.. శ్రీకాళహస్తిలో ఉన్నాయి.

కఠారి దంపతుల హత్యకేసులో నేడు తుదితీర్పు

● 4గంటల సేపు వాదనలు వినిపించిన చింటూ తరపు న్యాయవాది


కుటుంబ సభ్యులతో కోర్టు వద్ద కఠారి హేమలత

చిత్తూరు లీగల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పదేళ్ల క్రితం రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన చిత్తూరు ప్రథమ మేయర్ కఠారి అనురాధ దంపతుల హత్యకేసు విచారణ చివరి ఘట్టానికి చేరుకుంది. శుక్రవారం న్యాయమూర్తి తుది తీర్పు వెల్లడించనున్నారు. కఠారి అనురాధ, ఆమె భర్త కఠారి మోహన్ 2015 నవంబరు 17న నగరపాలక కార్యాలయంలోనే హత్యకు గురయ్యారు. ఈ సంఘటనపై చిత్తూరు ఒకటవ పట్టణ పోలీసులు చంద్రశేఖర్ అలియాస్ చింటూతో పాటు 22 మందిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.2022 నుంచి సాక్షుల విచారణ జరుగుతూ వచ్చింది.ఏ1 చంద్రశేఖర్ అలియాస్ చింటూ, ఏ2 వెంకటాచపలతి, ఏ3 జయప్రకాష్‌రెడ్డి, ఏ4 మంజునాథ్, ఏ5 వెంకటేశ్‌లపై నేరం రుజువైందని, మిగిలిన 16 మందిపై కేసు కొట్టివేస్తున్నట్లు ఈ నెల 24వ తేదీన తొమ్మిదవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి శ్రీనివాసరావు తీర్పు చెప్పారు. తదనంతరం నిందితుల వాంగ్మూలాలను తీసుకున్నారు. గురువారం ఈ కేసు వాయిదాకు రాగా వైద్యాధికారులు, పోలీసులు, మానసిక వైద్యులు తమ నివేదికలను సీల్డ్ కవర్లలో వేర్వేరుగా కోర్టుకు అందించారు. ఆ తరువాత న్యాయమూర్తి తన చాంబర్‌కు వెళ్లి ఆ నివేదికలను పరిశీలించారు. అనంతరం న్యాయమూర్తి కోర్టు హాలుకు రాగా చింటూ తరపు న్యాయవాది విజయచంద్రారెడ్డి మధ్యాహ్నం 3గంటలనుంచి సాయంత్రం 6.45 గంటల వరకు తన వాదనలను విన్పించారు.ఈ తరహా కేసుల్లో సుప్రీం కోర్టు, హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు పత్రాలను న్యాయమూర్తికి సమర్పిస్తూ వాదనలను విన్పించారు. అలాగే పబ్లిక్ ప్రాసిక్యూటర్ శైలజ కూడా వాదనలు విన్పించారు. సుదీర్ఘవాదనలు విన్న న్యాయమూర్తి కేసును శుక్రవారానికి వాయిదా వేస్తూ అదే రోజు తీర్పు వెల్లడిస్తానని చెప్పారు. గురువారమే కోర్టు తీర్పు వెల్లడిస్తుందని చింటూ, కఠారి వర్గాలకు చెందిన వారు కోర్టు వద్దకు చేరుకున్నారు. దాంతో అక్కడ కొంత ఉత్కంఠ నెలకొంది. పోలీసుల బందోబస్తుతో అవాంఛనీయ సంఘటనలు జరగలేదు.


కోర్టుకు వస్తున్న చింటూ తదితరులు

వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పునరుద్ధరణ చర్యలు చేపట్టండి

అధికారులతో కమిషనర్ మౌర్య సమీక్ష

తిరుపతి, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి) : నగరంలో వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టాల్సిన పునరుద్ధరణ చర్యలు, పారిశుధ్యం తదితర అంశాలపై గురువారం అధికారులు, ఆన్లైన్ ద్వారా సచివాలయ కార్యదర్శులతో కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో పలుచోట్ల డ్రైనేజి కాలువలు, రోడ్లు పాడయ్యాయని, వెంటనే పునరుద్ధరించాలని ఆదేశించారు. తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలో పారిశుధ్యం మరింత మెరుగ్గా చేపట్టాలన్నారు. చెత్త కుప్పలు, బురద తొలగించి బ్లీచింగ్ వేయాలని సూచించారు. కుక్కలు ఎక్కువగా ఉన్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయని, నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆగస్టు 30 నుంచి నగరంలో అనుమతులు లేని నిర్మాణాలు జరిగితే



సంబంధిత అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, ఏసీపీ మూర్తి, మధు, సర్వేయర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కార్పొరేషన్ స్థలంపై కన్ను

సచివాలయం కోసం ఉంచిన భూమి రాత్రికిరాత్రే చదును

తిరుపతి, - ఆంధ్రజ్యోతి : తిరుపతి 36వ డివిజన్లోని నగరపాలక సంస్థకు చెందిన విలువైన స్థలాన్ని గుర్తు తెలియని వ్యక్తులు చదును చేయడం మొదలుపెట్టారు. తిరుపతి అన్నమాచార్య కళామందిరం దక్షిణం వైపు దాదాపు 40 అంకణాల మున్సిపల్ స్థలం ఉంది. 2021 జూలైలో అప్పటి వైసీపీ నాయకుడు అధికార బలంతో సదరు స్థలాన్ని శుభ్రపరిచి మంచినీటి బోరు కూడా వేసేయండతో 'కోటి స్థలం కబ్జా' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో కబ్జాకు గురైన స్థలాన్ని మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కార్పొరేషన్ స్థలం అంటూ బోర్డు పెట్టి చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టారు. స్థానిక నేత వేసిన మంచినీటి బోరును కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ స్థలంలో గ్రౌండ్ ఫ్లోర్ కమర్షియల్‌గా, మొదటి అంతస్తు సచివాలయం కోసం కార్పొరేషన్ నిర్ణయించింది. అందు కోసం బడ్జెట్ ప్రతిపాదనలతో కౌన్సిల్లో తీర్మానం కూడా చేసింది. అయితే ఏ కారణం చేతనో పనులు మొదలుపెట్టలేదు. చుట్టూ ప్రహరీతో ఇన్నేళ్లుగా స్థలమైతే కబ్జాకు గురికాకుండా ఉంది. అయితే హఠాత్తుగా రాత్రివేళ ఎక్స్‌కవేటర్‌తో స్థలాన్ని చదును చేయడం, డివిజన్ నాయకులు మౌనంగా ఉండటం పలు అనుమానాలకు దారితీసింది. ఎమ్మెల్యే సన్నిహితుడిగా చెప్పుకునే ఓ వ్యక్తి సదరు స్థలంపై కన్నేసినట్టుగా తెలుస్తోంది. దాదాపు కోటి రూపాయల విలువ కలిగిన స్థలాన్ని కబ్జానుంచి కాపాడాల్సిన బాధ్యత కార్పొరేషన్‌పై ఉంది. కాగా దీనిపై మున్సిపల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్‌ను వివరణ కోరగా ఇంజనీరింగ్ విభాగం నుంచి ఎలాంటి పనులూ చేపట్టడంలేదని చెప్పారు. టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి వచ్చిన శిథిలావస్థలో ఉన్న భవనాల తొలగింపు, శుభ్రపరిచిన పత్రికా ప్రకటనలో ఈ స్థలం గురించి లేకపోవడం గమనార్హం.



కార్పొరేషన్ స్థలాన్ని శుభ్రం చేస్తున్న ఎక్స్‌కవేటర్

గరుడ వారధిపై వేగ నియంత్రణ చర్యలు

స్మార్ట్ సిటీ ఎండీ మౌర్య

తిరుపతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని గరుడ వారధిపై వేగ నియంత్రణకు అదనపు చర్యలు చేపట్టాలని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. గరుడ వారధిపై వాహనాల వేగ నియంత్రణ కోసం స్మార్ట్ సిటీ, పోలీస్, ఇంజనీరింగ్ అధికారులతో గురువారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గరుడ వారధిపై ప్రమాదాలు జరగకుండా ఇప్పటికే ఏర్పాట్లు చేశామని తెలిపారు. వాహన చోదకుల్లో మరింత అవగాహన కలిగించేలా చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా వేగాన్ని నియంత్రించే రబ్బర్ స్ట్రిప్స్, మలుపు తెలుపుతూ సూచిక బోర్డులు, బ్లింకర్స్ స్పీడ్ లిమిట్ బోర్డులు మరిన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే గరుడవారధి పైన, కింద ట్రాఫిక్ నియంత్రణ కోసం చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ రవిమనోహర్ ఆచారి, డీఎస్పీలు రామకృష్ణ ఆచారి, భక్తవత్సలం, స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, ఈ.ఈ. రవి, ఆఫ్కాన్స్ ప్రతినిధి రంగస్వామి పాల్గొన్నారు.

'భగవద్గీతను అవహేళన చేయడం సరికాదు'



భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కోట్లాది మంది భారతీయులకు, హిందువులకు పవిత్ర గ్రంథమైన భగవద్గీతను అవహేళన చేయడం ఎంతమాత్రమూ మంచిది కాదని టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. భగవద్గీత ఎందుకూ పనికిరాదని టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు ఎంఎస్ రాజు చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఆ మేరకు ఆయన ఓ వీడియోను విడుదల చేశారు. శ్రీకృష్ణభగవానుడు భగవద్గీతను ఉపదేశించి నేటికి 5,125 సంవత్సరాలు అవుతోందన్నారు. ఆదర్శ జీవనశైలి, నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకోవడం, ధర్మాన్ని ఏవిధంగా ముందుకు తీసుకెళ్లాలి అనే విషయాలను భగవద్గీత బోధిస్తుందన్నారు. ఇలా ఎంతో ఆదర్శవంతమైన అంశాలతో కూడిన భగవద్గీత కోట్లాది మంది హిందువుల జీవనశైలిలోఅంతర్భాగమని పేర్కొన్నారు. సునీతా విలియమ్స్ అంతరిక్షంలోకి వెళ్లే సమయంలో భగవద్గీతను, గణేష్ ప్రతిమను వెంట తీసుకెళ్లారని చెబుతూ గీత ప్రాశస్త్యాన్ని వివరించారు. అలాంటి గీత పట్ల ఎంఎస్ రాజు చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని, తక్షణం హిందువులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

4న తిరుపతిలో జాబ్‌మేళా



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తదితరులు

తిరుపతి అర్బన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలాజీకాలనీలోని ఎస్వీసీసీ డిగ్రీ కాలేజీలో నవంబర్ 4వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్లను గురువారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆవిష్కరించారు. శ్రీసిటీ, మేనకూరు సెజ్, ఈఎంసీ క్లస్టర్, చెన్నైలోని 18 బహుళ జాతీయ కంపెనీలలో 860పైగా ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. తిరుపతి నియోజకవర్గ పరిధిలో 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమా, ఏదైనా డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణత సాధించిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 8143576866, 9988853335లను సంప్రదించాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం కోరారు.

కాణిపాకంలో అతిథిగృహ నిర్ణయం సరికాదు



మీడియాతో మాట్లాడుతున్న రాంభూపాల్‌రెడ్డి

తిరుపతి(ఎంఆర్‌పల్లె), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కాణిపాకంలో అతిథి గృహ వసతి సముదాయాలను నిర్మించేందుకు రూ.25కోట్లు కేటాయించాలని టీటీడీ బోర్డు తీసుకున్న నిర్ణయం సరికాదని, వెనక్కు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంభూపాల్‌రెడ్డి కోరారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ కాణిపాకంలో వినాయక సదన్, గణేష్ సదన్ అనే వసతి సముదాయాలు ఉన్నాయని, ఇప్పటివరకు అవి పూర్తిగా నిండిన దాఖలాలు లేవని తెలిపారు. అస్మదీయులకు కాంట్రాక్టులు కట్టబెట్టడానికే ఇలాంటి నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు నిబంధనలను అతిక్రమించి వ్యవహరిస్తున్నారన్నారు. తిరుపతి పట్టణాధ్యక్షుడు గౌడపేర చిట్టిబాబు మాట్లాడుతూ కల్తీ నెయ్యి విచారణ పరిధిలోకి మాజీ ఈవో ధర్మారెడ్డిని ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. టీటీడీ పరకామణి విషయంలో సీబీఐ దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. టీటీడీలో జరుగుతున్న అవినీతిపై చర్యలు తీసుకోనిపక్షంలో పరిపాలన భవనం ఎదుట నిరసన తెలుపుతామన్నారు. లోకేష్‌రెడ్డి, శివశంకర్, జ్యోతీశ్వర్‌నాయక్, పార్థసారథిరెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రెక్టార్, రిజిస్ట్రార్ పదవుల్లో బీసీలను నియమించండి

బీసీ విద్యార్థి సంఘం



మధుమూర్తికి విన్నవిస్తున్న నారాయణగౌడ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం లోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న రిజిస్ట్రార్, రెక్టార్ పదవుల్లో సీనియర్ బీసీ ప్రొఫెసర్లను నియమించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ గౌడ్ కోరారు. ఈ మేరకు గురువారం మంగళగిరిలోని ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ మధుమూర్తిని కలిసి విన్నవించారు. నారాయణ గౌడ్ మాట్లాడుతూ రెక్టారు, రిజిస్ట్రార్ పదవుల్లో బీసీ వర్గీయులను నియమించడం ద్వారా సామాజిక న్యాయం చేయాలన్నారు. పాలక మండళ్లలోనూ బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

'శంకర్ నాయక్ స్థాయి మరిచి మాట్లాడుతున్నారు'



మీడియా సమావేశంలో వెంకటరమణ నాయక్ తదితరులు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు వడిత్య శంకర్ నాయక్ స్థాయి మరచి మాట్లాడుతున్నాడని ఆలిండియా బంజార సేవ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ నాయక్ అన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ విద్యార్థి సంఘ నేతగా ఎంతోమందిని దోచుకుని ఎదిగిన శంకర్ నాయక్ సీఎం చంద్రబాబును ఇష్టానుసారం మాట్లాడటం మంచి పద్ధతి కాదన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎస్టీ కమిషన్ సభ్యుడిగా ఉండి దళిత యువకులపై దాడులు, హత్యలు జరుగుతున్నా ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. తీరు మార్చుకోవాలని హితవు పలికారు. టీడీపీ ఎస్టీ సెల్ చంద్రగిరి నేతలు సుధాకర్‌నాయక్, రామకృష్ణనాయక్, వెంకటకృష్ణయ్య, సుమన్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

యువత విలువలను ఆచరించాలి

విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో ఎస్వీయూ వీసీ నరసింగరావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): యువత పారదర్శకత, బాధ్యత, నిజాయితీ వంటి విలువలను ఆచరించాలని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి నరసింగరావు పేర్కొన్నారు. ద న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ సెనేట్ హాల్లో గురువారం నిర్వహించిన విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. దేశాభివృద్ధికి యువత మూలస్తంభమని అభిప్రాయపడ్డారు. యువత విలువలను ఆచరించడం ద్వారా మంచి సమాజం ఏర్పడుతుందని తెలిపారు. రిజిస్ట్రార్ ఎం.భూపతి నాయుడు మాట్లాడుతూ ప్రతి పౌరుడూ చదువుతో పాటు విలువలను నేర్చుకోవాలని, ఆచరించాలని కోరారు. ద న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్ చీఫ్ బిజినెస్ మేనేజర్ పీఎస్ లతా మాట్లాడుతూ తమ సంస్థ విలువలు, నిజాయితీ, పారదర్శకతతో కూడిన బీమా సేవలకు కట్టుబడి ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్, ద న్యూ ఇండియా అష్యూరెన్స్ డిప్యూటీ మేనేజర్ సాయి గురుగోవింద్, అసిస్టెంట్ మేనేజర్లు నంద స్వరూపరెడ్డి, సృజన, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ నరసింగరావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

స్విమ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



టీటీడీ పరిపాలనా భవనం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : స్విమ్స్ కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి కోరారు. ఈ మేరకు గురువారం ఎన్టీఆర్ విగ్రహం నుంచి టీటీడీ పరిపాలనా భవనం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన ఆందోళన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గతంలో చేపట్టిన సమ్మె సందర్భంగా మూడు నెలల్లో పరిష్కరిస్తామని టీటీడీ అధికారులు హామీ ఇచ్చినా తర్వాత పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా స్పందించాలని, లేనిపక్షంలో మరో పోరాటానికి సిద్ధం కావాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం జేఈవో వీరబ్రహ్మంకు వినతిపత్రం సమర్పించారు. స్విమ్స్ డైరెక్టర్‌తో మాట్లాడి పరిష్కరిస్తామని జేఈవో హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ వేణుగోపాల్, సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి ఎం.మాధవ్, నగర అధ్యక్షురాలు బుజ్జి, కార్మికులు రవి, వెంకటేష్, సూరి, ముత్తు, గోపి, భాష, మునికృష్ణ, మునేంద్ర, జయమ్మ, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

9న తిరుమలలో కార్తీక వనభోజనోత్సవం

తిరుమల, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): తిరుమలలో నవంబరు 9వ తేదీన కార్తీక వనభోజన కార్యక్రమం జరుగనుంది. ఈ సందర్భంగా శ్రీవారి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా పార్వేట మండపానికి తీసుకువెళ్లి స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు వితరణ చేస్తారు. నవంబరు 2న కైశిక ద్వాదశి ఆస్థానం, చాతుర్మాస దీక్ష, 5న కార్తీక పౌర్ణమి గరుడసేవ జరుగనున్నాయి.

డిజిటల్ మార్కెటింగ్ వెబ్‌సైట్ ప్రారంభం

శ్రీకాళహస్తి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తికి చెందిన కొంతమంది ముస్లిం యువత డిజిటల్ మార్కెటింగ్ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. వెబ్‌సైట్‌ను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం యువత ఉపాధి కల్పనకు ఎంతో కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగానే గూగుల్ డేటా సెంటర్ వైజాగ్‌కు తీసుకొచ్చిందన్నారు.

ఆగమోక్తంగా మహా చండీహోమం



హోమంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న అర్చకులు - చండీ హోమ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : స్థానిక కపిలేశ్వరస్వామి ఆలయంలో గురువారం మహా చండీహోమం ఆగమోక్తంగా నిర్వహించారు. కార్తీక మాసోత్సవాల్లో భాగంగా ఆలయ ఆవరణలోని ఆంజనేయ స్వామి సన్నిధికి సమీపంలో ఏర్పాటు చేసిన వేదికలో ఈ హోమ పూజలు చేశారు. ముందుగా కామాక్షి అమ్మవారి ఉత్సవమూర్తికి విశేష పూజలు నిర్వహించి సర్వాలంకారాలు చేశారు. కలశ స్థాపన చేసి గణపతి పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. కాళికాదేవి, మహాలక్ష్మి, సరస్వతీదేవి అమ్మవార్లను ఆవాహనం చేస్తూ శాస్త్రోక్తంగా పూజలు చేశారు. హోమ గుండంలో అగ్ని ప్రతిష్ఠ చేసి తొలుత గణపతి, లక్ష్మీ గణపతి, మహాలక్ష్మి పూజలు చేశారు. తర్వాత చండీహోమాన్ని ఆరంభించి దుర్గాసప్తశతిలోని 700 శ్లోకాలను పారాయణం చేశారు. చివరిగా పూర్ణాహుతి సమర్పించారు. పండితుల వేదమంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ ఉదయం, సాయంత్రం రెండుసార్లు ఈ హోమ పూజ నిర్వహించారు. ఇలా తొమ్మిది రోజులపాటు జరిగే ఈ హోమ పూజల్లో ఆఖరి రోజున మహా పూర్ణాహుతి సమర్పించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్నం, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

రేపు, ఎల్లుండి తిరుపతి బాలోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న నాగార్జున

తిరుపతి(ఎంఆర్‌పల్లె), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాల వేదికగా నవంబరు 1, 2 తేదీలలో తిరుపతి బాలోత్సవం నిర్వహించనున్నట్లు తిరుపతి బాలోత్సవం వ్యవస్థాపకుడు మల్లారపు నాగార్జున తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లల్లో పెరుగుతున్న మానసిక ఒత్తిడిని తగ్గించి, వారిలోని సృజనాత్మకతను వెలికితీయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన కమిటీ సభ్యులతో కలిసి మాట్లాడారు. మూడేళ్లుగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తూ ఆటవిడుపు కార్యక్రమంగా బాలోత్సవం నిలిచిందన్నారు. ఈ ఏడాది నిర్వహించే పోటీల్లో అన్ని యాజమాన్య పాఠశాలలకు చెందిన ఎల్‌కేజీ నుంచి పదవ తరగతి విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టెంకాల దామోదరం, నారాయణ, పయ్యావుల గురునాథం, మణికంఠ, మునిలక్ష్మి పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ బోటనీ పరిశోధకుడు కె.సాయివెంకటేష్ డాక్టరేట్ పొందారు. రీ ప్రొడక్టివ్ సక్సెస్ అండ్ ప్రోపగేషన్ ఆఫ్ సెలెక్టెడ్ రింకోసియ స్పీసిస్ అంశంపై ప్రొఫెసర్ జేఎస్ఆర్ మూర్తి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. సాయి వెంకటేష్ శ్రీకాళహస్తి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని పరిశోధనా పత్రాలు సమర్పించారు. వివిధ జర్నల్స్‌లో పరిశోధనా వ్యాసాలు ప్రచురితమయ్యాయి. డాక్టరేట్ పొందిన సందర్భంగా పలువురు ఆయన్ను అభినందించారు.



సాయి వెంకటేష్

కోళ్ల పందేలపై దాడులు

● ముగ్గురి అరెస్టు

తిరుపతి (నేరవిభాగం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం చిగురువాడ సమీపంలోని స్వర్ణముఖి నది ఒడ్డున మామిడి చెట్ల మధ్యలో గురువారం ఆడుతున్న కోళ్ల పందేలపై పోలీసులు దాడి చేశారు. ముగ్గురిని అరెస్టు చేశారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది కలిసి దాడి చేశారు. రాజంపేటకు చెందిన శ్రీనివాసులు, వెంకట సుబ్బయ్య, నిడిగంటి పక్కీరయ్యను పట్టుకుని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.4100 నగదు, ఒక కారు, ఒక కోడి స్వాధీనం చేసుకున్నారు. పరారైన వారిలో గాంధీపురానికి చెందిన సుబ్రహ్మణ్యం, శివ, జగ్గా, రాజంపేటకు చెందిన అబ్దుల్లా ఉన్నారు. వీరిలో గాంధీపురానికి సుబ్రహ్మణ్యం నాటు కోళ్ల వ్యాపారం చేస్తున్నాడు. ఇతడికి రాజంపేటకు చెందిన ప్లాటు బిజినెస్ బ్రోకర్ అబ్దుల్లాతో పరిచయమైంది. ఈ క్రమంలో రాజంపేట నుంచి అతడి స్నేహితులను పిలిపించి సుబ్రమణ్యం సహాయంతో కొందరు స్థానికులతో కలిసి పదిమంది దాకా కోళ్ల పందెం ఆడుతున్నారు. ఈ ఘటనపై రూరల్ సీఐ చిన్న గోవిందు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ముందుచూపుతోనే తక్కువ నష్టంతో బయటపడ్డాం

● ఎంపీ సీఎం రమేష్

తిరుమల, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముందుచూపుతో మొంథా తుఫాను నుంచి చాలా తక్కువ నష్టంతో బయటపడ్డామని ఎంపీ సీఎం రమేష్ అన్నారు. మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, కుటుంబ సభ్యులతో కలిసి ఆయన గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఎక్కడిక్కడ అధికారులను అప్రమత్తం చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారన్నారు. అంతకుముందు ఆయన శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.


బీటెక్ రవి, సీఎం రమేష్

'అఖండ 2' మ్యూజిక్ కొంత పూర్తయింది



● డ్రమ్స్ శివమణి

తిరుమల, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): నందమూరి బాలకృష్ణ 'అఖండ2' సినిమాకు సంబంధించి బ్యాగ్రౌండ్ మ్యూజిక్ కొంతమేరకు పూర్తయిందని డ్రమ్స్ కళాకారుడు శివమణి తెలిపారు. గురువారం శ్రీవారిని దర్శించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఈ సినిమాలో తనకు అవకాశం కల్పించిన సంగీత దర్శకుడు తమన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తిరుమలలో మంచి దర్శనాలు చేయిస్తున్న సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలన్నారు.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.4 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 64,048

తలనీలాలు సమర్పించినవారు: 19,838





కదిలొచ్చిన పూలవనం

తొమ్మిది టన్నుల పుష్పాలతో అభిషేకం

చామంతి, సంపంగి, రోజాలు, గన్నేరు, మల్లె, మొల్లలు, కనకాంబరం, తామర, మాను సంపంగి, కలువ, మనోరంజితం, పారిజాతం, వృక్షి, సెంటుజాజి, మొగలి రేకులు, నిత్య మల్లె.. ఇలా 16 రకాల పూలు, ఐదు రకాల పత్రాలు.. శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీనివాసుడి సేవలో తరించాయి. పుష్పయాగం సందర్భంగా గురువారం తిరుమల ఆలయంలో ఉత్సవమూర్తుల హృదయాల దాకా పూలు నిండిపోయాయి. ఉదయమే ఆలయానికి పూలబుట్టలు బారులు తీరాయి. పుష్పవనమే తరలి వస్తున్నట్టుగా ఆ దృశ్యం కనిపించింది. తమిళనాడు నుంచి ఐదు టన్నులు, కర్ణాటక నుంచి రెండు టన్నులు, ఏపీ నుంచి రెండు టన్నుల చొప్పున మొత్తం 9 టన్నుల పూలను పుష్పాభిషేకం కోసం తెప్పించారు. తులసి, మరువం, దవణం, బల్వం, పన్నీరు, కదిరిపచ్చలనూ పుష్పయాగంలో అర్చనకు వినియోగించారు. బ్రహ్మోత్సవాల సమయంలో తెలియక జరిగే దోషాల నివారణకు కార్తీకమాసంలో వచ్చే శ్రీవారి జన్మనక్షత్రమైన శ్రణానక్షత్రంలో పుష్పయాగాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అంతకుముందు స్నపన తిరుమంజనం జరిగింది. కాగా, ఈ పూలను దాతల ద్వారా సమకూర్చడంలో విశేష కృషి చేసిన గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులను ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం శాలువాతో సత్కరించారు.

-తిరుమల, ఆంధ్రజ్యోతి









తిరుమల తర్వాత కాణిపాకం రండి

● పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్



తిరుమల, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులందరూ కాణిపాక వినాయకస్వామి ఆలయాన్ని కూడా దర్శించాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ విజ్ఞప్తి చేశారు. తిరుమల శ్రీవారిని గురువారం దర్శించుకున్న ఆయన అనంతరం మీడియాతో మాట్లాడుతూ, కాణిపాకంలో వసతి సముదాయం, కల్యాణవేదికల నిర్మాణం కోసం రూ.25 కోట్లు కేటాయించిన టీటీడీ చైర్మన్, సభ్యులు, ఈవో, అదనపు ఈవోలకు ధన్యవాదాలు తెలిపారు.

శ్రీవారి సేవలో కేరళ హైకోర్టు న్యాయమూర్తి



తిరుమల, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణన్ నటరాజన్ గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం చేశారు.

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష
దరఖాస్తుకు 9 వరకు గడువు

తిరుపతి(విద్య), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సైనిక్ స్కూల్ ప్రవేశాలకు నిర్వహించే జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షకు నవంబర్ 9వ తేదీ వరకు గడువు పొడిగించారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రం అధినేత డాక్టర్ ఎస్.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి 6, 9 తరగతుల్లో ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష వచ్చే ఏడాది జనవరి 18వ తేదీన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వయసును బట్టి 4 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న బాలబాలికలకు ఈ పరీక్షకు అర్హత ఉంటుందని వెల్లడించారు. దరఖాస్తు విధానం, అర్హతలు, పరీక్ష విధానం గురించి పూర్తి వివరాలు తెలుసుకునేందుకు 86888 88802, 93999 76999లలో తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం సైనిక్ - నవోదయ పోటీ పరీక్షల శిక్షణా కేంద్రాన్ని సంప్రదించవచ్చని తెలిపారు.

ఇసుక తరలిస్తున్న టిప్పర్ సీజ్

రేణిగుంట అక్టోబర్ 30 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్ లారీని గాజులమండ్యం పోలీసులు సీజ్ చేశారు. ఎస్ఐ సుధాకర్ కథనం మేరకు.. గురు వారం ఉదయం స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్ లారీని తూకివాకం పెట్రోల్ బంకు వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అడ్డుకున్నారు. స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేశారు.

నూతన కమిటీతో వేదపారాయణదారుల నియామకాలు

తిరుమల, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): టీటీడీ వేదపారాయణదారుల పోస్టుల భర్తీకి నవంబరు 10వ తేదీన ఇంటర్వ్యూలు జరుగనున్నాయి. ఈమేరకు ముగ్గురు సభ్యులతో కూడిన నూతన కమిటీ ఈ ఇంటర్వ్యూలను నిర్వహించనుంది. దాదాపు 700 మంది వేదపారాయణదారుల పోస్టుల భర్తీకి గతంలో టీటీడీ అంగీకారం తెలిపిన నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్ర బ్రాహ్మణులకు నష్టం కలిగేలా, తమిళనాడువాసులకు లబ్ధిచేకూరేలా వ్యవహరించారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో ఈ ఇంటర్వ్యూలు జరగకుండా టీటీడీ బోర్డు, అధికారులు నిర్ణయం తీసుకోవడంతో గత నెలలో భర్తీ ప్రక్రియ నిలిచిపోయింది. పాత కమిటీలోని వారిని తొలగించిన టీటీడీ.. తాజాగా మరో ముగ్గురు సభ్యులను నియమించి పారదర్శకంగా ఇంటర్వ్యూలు నిర్వహించాలని ఆదేశించింది. ఇప్పటికే ఫైనల్ చేసిన దరఖాస్తుదారులకు కాల్‌లెటర్లు పంపారు. దరఖాస్తుల స్వీకరణ సమయంలోనే రాష్ట్ర బ్రాహ్మణులను తొలగించారని, గత అధికారులు ఎంపిక చేసిన తమిళనాడువాసుల దరఖాస్తులను స్వీకరించి నూతన కమిటీతో ఇంటర్వ్యూలు చేయించినా రాష్ట్ర బ్రాహ్మణులకు న్యాయం జరగదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై టీటీడీ అధికారికంగా ప్రకటన చేయాల్సి ఉంది.

ఏడేళ్లుగా పరిశ్రమల కోసం ఎదురు చూపులు



ఏపీఐఐసీ బోర్డు

● 80కి పైగా ఏర్పాటు చేస్తామన్న మంత్రి

● అమలుకు నోచుకోక నిరాశలో ప్రజలు

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలత్తూరు, కొత్తపాళెం, భవానీశంకరపురంతోపాటు తొట్టంబేడు మండలం రౌతుసూరమాల గ్రామాల ప్రజలు పరిశ్రమల కోసం ఎదురు చూస్తున్నారు.


ఏపీఐఐసీకి కేటాయించిన భూమి

2017లో ఈ నాలుగు గ్రామాల నుంచి ప్రభుత్వం ఏపీఐఐసీ ద్వారా 2095 ఎకరాల భూములను సేకరించింది. గత ప్రభుత్వంలో ఈ భూములకు సంబంధించిన భూపరిహారాన్ని రైతులకు చెల్లించింది. వివిధ కారణాలతో కొంత మందికి చెల్లించలేదు. ఈ భూములకు లింక్ రోడ్డు నిర్మాణాలు, నాయుడుపేట హైవేకు ఆరులేన్ల రోడ్డు ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. భూములు శరవేగంగా తీసుకున్న అధికారులు ఇప్పటి వరకు ఒక్క పరిశ్రమను కూడా తీసుకురాకపోవడంతో ప్రజలు నిరాశకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో పెద్ద ఎత్తున పరిశ్రమలు నెలకొల్పడంతో ఈ ప్రాంతంలో కూడా పరిశ్రమలు నెలకొల్పుతారన్న ఆశతో ఉన్నారు. గత సంవత్సరం ఆగస్టులో రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషనర్ యువరాజ్ ఏపీఐఐసీ భూములను సందర్శించి, త్వరితగతిన భూములను అభివృద్ధి చేసి పరిశ్రమలు స్థాపిస్తామని చెప్పారు. ఈ సంవత్సరం ఏప్రిల్‌లో సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఏపీఐఐసీ భూములను పరిశీలించారు. ఈ భూములను అభివృద్ధి చేసి, 80 పరిశ్రమల ఏర్పాటుకు కేటాయిస్తున్నామని, నెల రోజుల్లో శంకుస్థాపన చేస్తామన్నారు. భూముల్లో లింక్ రోడ్ల పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించి ఏడు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు పట్టించుకున్న వారు లేరని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఏపీఐఐసీ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పరిశోధనలు ప్రగతికి తోడ్పడాలి:కలెక్టర్

పాకాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): శాస్త్రవేత్తలు, రీసెర్చ్ స్కాలర్లు తమ పరిశోధనలతో దేశాభివృద్ధికి తోడ్పడాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సూచించారు. విజిలెన్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆయన గురువారం గాదంకిలోని ఎన్ఏఆర్ఎల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాస్త్రవేత్తలు పరిశోధనలకు అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. వాతావరణంపై ఇక్కడ జరుగుతున్న పరిశోధనలు అభినందనీయమన్నారు. పరిశోధనా ఫలితాలు వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగకరమన్నారు. మొంథా తుపానుకు సంబంధించి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవడానికి వాతావరణ పరిశోధన కేంద్రాలవల్లనే సాధ్యమైందని గుర్తు చేశారు. ఇలాంటి కీలక కార్యాలయ విధుల్లో అప్రమత్తత అవసరమన్నారు. ఆయన సంస్థలోని హై పెర్మార్మెన్స్ కంప్యూటింగ్ వ్యవస్థ, వాతావరణ పరిశోధన, రాడార్ విధానాలను ఆసక్తిగా పరిశీలించారు. ఎన్ఏఆర్ఎల్ డైరెక్టర్ డాక్టర్ అమిత్ కుమార్ పాత్రో, విజిలెన్స్ అధికారి రఘునాథ్, అవేర్‌నెస్ కమిటీ ఛైర్మెన్ డాక్టర్ చైతన్య జైన్ ఏవో మల్లిక మాధురి, రీసెర్చ్ స్కాలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


ఎన్ఏఆర్ఎల్ అధికారులు,శాస్త్రవేత్తలు. రీసెర్చి స్కాలర్లు,సిబ్బందితో కలెక్టర్

వైభవంగా అత్తి వరదరాజస్వామి విగ్రహ స్థాపన పూజలు




వరదరాజస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన - హోమపూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధగా కొలువైన వరదరాజస్వామి ఆలయంలో గురువారం అత్తివరదరాజస్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. అగ్ని ప్రతిష్ఠాపనం, కుంభారాధనం, మహాశాంతి పూజలు చేశారు. అనంతరం విగ్రహస్థాపన జరిగింది. అనంతరం స్వామివారికి పలు రకాల అభిషేకాలు నిర్వహించి, అలంకరించారు. ఆలయ ఆవరణంలో హోమపూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ కొట్టే సాయిప్రసాద్, ఆలయాధికారులు తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం అగ్నిప్రణయనం, కుంభారాధనం, సర్వగాయత్రి హోమం జరగనుంది.

పటేల్ స్ఫూర్తితో దేశాభివృద్ధికి పాటుపడాలి

● ఐక్యతా ర్యాలీలో వక్తలు


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, బీజేపీ నేతలు తదితరులు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఉక్కు మనిషి సర్దార్ వల్లబాయ్ పటేల్ స్ఫూర్తిగా యువత దేశం కోసం, ఐక్యత కోసం పాటుపడాలని పలువురు వక్తలు యువతకు పిలుపునిచ్చారు. మాజీ ఉప ప్రధాని పటేల్ 150వ జయంతి సందర్భంగా తిరుపతిలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో ఐక్యతా ర్యాలీ నిర్వహించారు. బాలాజీ కాలనీ నుంచి కచ్చపి ఆడిటోరియం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎస్వీయూ, ఇతర ప్రైవేటు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కచ్చపి ఆడిటోరియంలో జరిగిన సభా కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ స్వాతంత్ర్య అనంతరం దేశం ముక్కలయ్యే పరిస్థితుల్లో పటేల్ దృఢ సంకల్పంతో 560 సంస్థానాలను ఒక్కటిగా చేసి భారతదేశంగా మలిచారని చెప్పారు. ఆయన ఆశయాలు, సంకల్పం మనందరికీ ఆచరణ కావాలని పిలుపునిచ్చారు. ఎస్వీయూ వీసీ ఆచార్య నరసింగారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు మాట్లాడుతూ పటేల్ ఆదర్శంగా ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. రాష్ట్రాలకు నిధుల పెంపు, నీతి ఆయోగ్, జీఎస్టీ తగ్గింపు తదితర విధానాలతో కేంద్ర ప్రభుత్వం దేశ సమగ్రతకు పాటుపడుతోందన్నారు. బీజేపీ రాష్ట్ర సంఘటనా మంత్రి మధుకర్ మాట్లాడుతూ పటేల్ జీవిత విశేషాలను, ప్రముఖ సంఘటనలను ఉదహరిస్తూ విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. ఈ సందర్భంగా విద్యార్థులు యోగాసనాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత, టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్, ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ పాల్గొన్నారు.



తిరుపతిలో సాగుతున్న ఐక్యతా ర్యాలీ

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని డీఎస్పీ గీతాకుమారి అన్నారు. గురువారం స్థానిక రెండో పట్టణ పరిధిలోని ఓ ప్రైవేటు క్లబ్‌లో పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న మరొకరికి ప్రాణదానం చేసినవారమవుతామన్నారు. యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలన్నారు. ప్రజల రక్షణకు, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్‌శాఖ అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో సీఐలు శేఖర్‌బాబు, శ్రీనివాస్, ఎస్‌ఐలు తిరుపతయ్య, సుబ్రమణ్యంరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో మెగా రక్తదాన శిబిరం



మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ చెంచుబాబు, తిరుమలనాయుడు, రక్తదాన శిబిరంలో డీఎస్పీ, సీఐ, పోలీసు సిబ్బంది

నాయుడుపేట టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రక్తదానంతో మరొకరికి ప్రాణదానం కలుగుతుందని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు అన్నారు. నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. పోలీసు సిబ్బందితోపాటు, టీడీపీ నాయకులు, మేనకూరు సెజ్‌లోని వివిధ కర్మాగారాల కార్మికులు దాదాపు 200 మంది రక్తదానం చేశారు. అర్బన్ సీఐ బాబి, ఎస్ఐ ఆదిలక్ష్మి, టీడీపీ నాయకులు పూనాటి తిరుమలనాయుడు, పొట్లపూడి రాజేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● ఓజిలి: స్థానిక పోలీసు స్టేషను వద్ద ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓజిలిలో యువకులు, ఆటో యూనియన్, విద్యార్థులు, పోలీసులు కలసి 80 మంది వరకు రక్తదానం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు, ఓజిలి, పెళ్లకూరు, దొరవారిసత్రం ఎస్‌ఐలు శ్రీకాంత్, నాగరాజు, అజయ్ కుమార్‌తోపాటు పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ



అక్కసముద్రం భూముల్లో బాధితుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ

బాలాయపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని యాచవరం గ్రామానికి చెందిన వరికూటి అన్నపూర్ణ అనే మహిళ స్వాధీనంలో ఉన్న భూమిని వెంగమాంబపురం గ్రామానికి చెందిన సీసీ నాయుడు ఆక్రమిస్తుండగా అడ్డుకున్నందుకు తనపై దాడి చేసి కులం పేరుతో దూషించాడని బాధితురాలు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం గూడూరు డీఎస్పీ గీతాకుమారి అక్కసముద్రం రెవెన్యూ పరిధిలో వివాదాస్పదంగా మారిన భూమిని పరిశీలించి, అట్రాసిటీ కేసుపై విచారణ చేపట్టారు. డీఎస్పీ వెంట ఎస్ఐ గోపీ, వీఆర్వో పెంచలయ్య, సర్వేయర్ పూజిత ఉన్నారు.

తప్పుడు కేసులతో టార్గెట్ చేస్తున్నారు

● టీడీపీ సీనియర్ నేత సీసీ నాయుడు



వెంకటగిరి, అక్టోబర్ 30(ఆంధ్రజ్యోతి): తప్పుడు కేసులతో తనను టార్గెట్ చేస్తున్నారని టీడీపీ సీనియర్ నేత, బాలాయపల్లి మండలానికి చెందిన సీసీ నాయుడు ఆరోపించారు. భూఆక్రమణ, దళితులపై దాడి చేశారన్న ఆరోపణలతో బాలాయపల్లి పోలీసులు తనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసిన నేపథ్యంలో గురువారం స్థానిక తెలుగుగంగ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను టీడీపీ తరుపున ప్రజా సమస్యలపై పోరాడిన ప్రతిసారి కక్షతీర్చుకొనే చర్యలు ఎదుర్కొంటున్నానని అన్నారు. తనపై పెట్టిన కేసు వెనుక వైసీపీ నాయకులతోపాటు తమ పార్టీకి చెందిన కొంత మంది నేతల ప్రమేయం ఉందని ఆరోపించారు. భూఆక్రమణలపై స్పందించిన ఆయన సదరు భూమిపై తనకు హక్కు పట్టాలు ఉన్నాయన్నారు. తాను ఎవరి భూమినైనా ఆక్రమించినట్లు, దళితులను దూషించినట్లు రుజువు చేస్తే తాను జైలుకు వెళ్లేందుకు సిద్ధమేనన్నారు. 40 ఏళ్ల తన రాజకీయ జీవితంలో సొంత ఇల్లు కూడా కట్టుకోలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు.

యూరియా అందిస్తాం.. ఆందోళన వద్దు



యూరియా టోకెన్‌ను అందిస్తున్న ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, కేవీ నాయుడు

పెళ్లకూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకు సరిపడా యూరియా అందజేస్తామని, ఆందోళన చెందవద్దని జనసేన ఇన్‌చార్జి, నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ కుమార్ తెలిపారు. గురువారం చిల్లకూరు సొసైటీ గోడౌన్‌లోని యూరియా పంపిణీ కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ కొచ్చర్ల వెంకటరమణయ్య నాయుడితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతి రైతుకు తగినంత యూరియా సరఫరా చేసేలా చర్యలు తీసుకుందన్నారు. కేవీనాయుడు మాట్లాడుతూ చిల్లకూరు సొసైటీలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. యూరియాను పారదర్శకంగా పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. చిల్లకూరు సొసైటీ డైరెక్టర్ ఎద్దల రామకృష్ణారెడ్డి, సిబ్బంది నెలవల లోకేష్, కుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు కలిచేటి నరసింహులు, టీడీపీ నాయకులు అక్కరపల్లి మాధవరెడ్డి, బైనా సుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు ఉన్నారు.

యువత స్వచ్ఛతాహీ సేవలో భాగస్వాములు కావాలి



విద్యార్థులకు ప్రోత్సాహక నగదు, సర్టిఫికేట్లను అందజేస్తున్న హరికృష్ణ, సుబ్బారెడ్డి

నాయుడుపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో యువత భాగస్వాములై నాయకత్వ పాత్ర పోషించాలని సమాచార ప్రసార మంత్రిత్వశాఖ సెంట్రల్ కమ్యూనికేషన్ బ్యూరో హరికృష్ణ అన్నారు. నాయుడుపేట విక్రమ్ కళాశాలలో గురువారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో డైరెక్టర్ కామిరెడ్డి సుబ్బారెడ్డి, సీడీపీవో ఉమామహేశ్వరి తదితరులతో కలసి మొక్కలు నాటారు. విద్యార్థులకు స్వచ్ఛతాహీ సేవా అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, ప్రోత్సాహక నగదు, సర్టిఫికేట్లను అందజేశారు.

వైభవంగా కోటి సోమవార పూజలు



శివాలయంలో కార్తీకదీపాలను వెలిగిస్తున్న భక్తులు

గూడూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు శివాలయాల్లో గురువారం కోటి సోమవార పూజలను ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసంలో శ్రవణ నక్షత్రం వచ్చే రోజును పురస్కరించుకుని కోటి సోమవారం పూజలు నిర్వహించారు. మహిళలు స్థానిక శివాలయం, వీరభద్రస్వామి, సోమేశ్వరస్వామి తదితర ఆలయాల్లో కార్తీక దీపాలను వెలిగించి, స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపారు.

గూడలిలో..



గూడలిలో ఊరేగుతున్న కామాక్షిదేవి, సంగమేశ్వరుడు

కోట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి కామాక్షిదేవి సమేత సంగమేశ్వర స్వామి ఆలయంలో గురువారం రాత్రి కోటి సోమవారం పూజలు జరిగాయి. ప్రధానార్చకుడు కార్తీక్‌శర్మ ఆధ్వర్యంలో సంగమేశ్వర మూలవిరాట్‌కు పలు అభిషేకాలు చేసి విశేష అలంకారంలో ఉంచారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక హోమాలు జరిగాయి. కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన మహిళలు ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంగమేశ్వరుడు, కామాక్షిదేవి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను గూడలి పురవీధుల్లో శివనామస్మరణలతో ఊరేగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రభుత్వ వసతిగృహ బాలికలకు రవాణా సౌకర్యం కల్పిస్తాం



మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీని కలిసిన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు తదితరులు


నాయుడుపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, జూనియర్ కళాశాలలో అభ్యసిస్తున్న బాలికల వసతి గృహానికి ఆయా విద్యాశాలలకు ఉచిత రవాణా సౌకర్యం ఏర్పాటు చేస్తామని మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ అన్నారు. నాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, వార్డెన్ హనుమంతరావు గురువారం మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విన్నమాలలోని తహసీల్దారు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వసతి గృహం నుంచి దాదాపు 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉన్నత పాఠశాలకు, జూనియర్ కళాశాలకు బాలికలు రావడానికి రైల్వే ట్రాక్‌ను దాటుకొని అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలియజేశారు. స్పందించిన రఫీ ఈ విషయం స్థానిక ఎమ్మెల్యే విజయశ్రీ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని, ఈలోపు తాత్కాలికంగా తన సొంత నిధులతో విద్యార్థినులను విద్యాలయాలకు పంపేలా రవాణా సౌకర్యం ఏర్పాటు చేస్తామన్నారు.

ప్రజాసమస్యలను పట్టించుకోవాలి

నాయుడుపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసేందుకు ప్రయత్నించే నాయకుల పట్ల పోలీసులు ప్రజాహితంగా పనిచేయాలని సీఐటీయు మండల కార్యదర్శి మహేష్, శివకవి ముకుంద అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాయుడుపేట పాత ట్రెజరీ కార్యాలయం ప్రాంతంలో పాత జీఎన్‌టీ రోడ్డు గుంతలమయంగా ఉందని, ఇది పట్టణానికి ప్రధాన రహదారికావడంతోపాటు మేనకూరు సెజ్‌కు వెళ్లే రహదారితో ప్రతిరోజు అధిక టన్నులతో వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయన్నారు. ఈ రహదారి గుంతలమయం కావడంతో ప్రభుత్వానికి నిరసన తెలియజేసేలా వరినాట్లు చేపట్టే కార్యక్రమాన్ని చేపట్టగా, పోలీసులు అడ్డుకొని నిలిపివేయడం అప్రజాస్వామికమన్నారు. సతీష్, వెంకయ్య, శాంతమ్మ తదితరులు ఉన్నారు.

గోతిలో వాలిపోయిన సిమెంట్ లారీ

● తృటిలో తప్పిన ప్రమాదం



కోట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కోట పట్టణ పరిధిలోని చల్లకాలువ వంతెన వద్ద గురువారం ఫైబర్ కేబుల్ కోసం తవ్విన గుంతలో పడి సిమెంట్ లారీ వాలిపోయింది. గూడూరు నుంచి సిమెంట్ లోడ్‌తో లారీ కోటకు వస్తూ చల్లకాలువ వంతెన గోతుల్లో ప్రమాదవశాత్తు ముందు చక్రాలు దిగబడిపోవడంతో ఒక్కసారిగా వాలిపోయింది. లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్ చాకచక్యంగా బయటకు దూకేయడంతో పెను ప్రమాదం తప్పింది.

నేడు 2కెరన్

నాయుడుపేట టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సర్ధార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా, పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా 2కెరన్‌ను నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహిస్తున్నట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. ఉదయం 6 గంటలకు నాయుడుపేట అమరావతి సెంటర్ వద్ద నుంచి సీఎస్‌తేజ సెంటర్ వరకు 2కెరన్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

● వెంకటగిరిటౌన్: అక్టోబరు 31న 2కే రన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీఐ ఏవీ రమణ తెలిపారు. ఉదయం 7గంటలకు క్రాస్ రోడ్డు నుంచి పాలకేంద్రం వరకు జరుగుతుందన్నారు.

వెంకటగిరిని డివిజన్ కేంద్రంగా చేయాలి

వెంకటగిరిటౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వెంకటగిరిని డివిజన్ కేంద్రంగా చేసేందుకు అన్ని వసతులు ఉన్నాయని వైసీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎన్‌జేఆర్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ గూడూరును నెల్లూరులో విలీనం చేసినప్పుడు వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి కేంద్ర డివిజన్‌ను ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

చిన్నారులపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

కోట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారుల పట్ల వర్కర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీడీపీవో మునికుమారి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కోట, కొక్కుపాడు క్లస్టర్ అంగన్‌వాడీ కేంద్రాల వర్కర్లతో సమీక్ష జరిగింది. సీడీపీవో మాట్లాడుతూ వర్షాలు ఆగిపోయినందున చిన్నారులకు సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ కృష్ణమ్మ తదితరులు ఉన్నారు.

శిథిలావస్థలో బస్ షెల్టర్లు

● ఎండ, వానల్లో ప్రయాణికులకు అవస్థలు

బాలయపల్లి, అక్టోబరు 30: ప్రయాణికుల సౌకర్యార్థం మండలంలో పదికి పైగా నిర్మించిన బస్ షెల్టర్లు శిథిలావస్థకు చేరుకోవడంతో నిరుపయోగంగా మారాయి. వెంకటరెడ్డిపల్లి, రామాపురం, అక్కసముద్రం, సంగవరం, పెరిమిడి, బైరవరం, బాలాయపల్లి తదితర ప్రాంతాల్లో నిర్మించిన బస్ షెల్టర్లు శిథిలావస్థకు కున్నాయి. ఈ షెల్టర్ల లోపల వేచి ఉండేందుకు వసతులు లేక, శ్లాబు పెచ్చులు ఊడి పడుతుండడంతో ప్రయాణికులు లోపలికి వెళ్లేందుకు సాహసించడం లేదు. దీంతో వారు బస్సుల కోసం ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ షెల్టర్ల బయట వేచి ఉంటున్నారు. లక్షలాది రూపాయలతో నిర్మించిన బస్ షెల్టర్లు కేవలం మందు బాబులకు అడ్డాగా మారాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్ షెల్టర్లను వినియోగం



రామాపురం, వెంకటరెడ్డిపల్లి వద్ద దుస్థితిలో నిరుపయోగంగా ఉన్న బస్ షెల్టర్లు

లోకి తీసుకువచ్చి ప్రయాణికుల అవస్థలు తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.

మత్స్యకారులకు అండగా కూటమి ప్రభుత్వం

● ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తడ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు ఎప్పుడూ అండగా ఉండేది కూటమి ప్రభుత్వమేనని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. గురువారం సాయంత్రం భీములవారిపాళెం వద్ద మత్స్యకారులకు బియ్యం, నిత్యావసరాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఇందులో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ మొంథా తుపాన్‌తో వేట లేక నష్టపోయిన మత్స్యకారులను ఆదుకునేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు 50 కేజీల బియ్యం, చక్కెర, కందిపప్పు, నూనె, ఉల్లగడ్డలు, ఉల్లిపాయలు అందించాలని ఆదేశించారన్నారు. వాటిని ఒక్కరోజులోనే ఆయా కుటుంబాలకు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. పునరావాస కేంద్రాలలో ఉన్న వరద బాధితులకు కుటుంబానికి రూ.3వేలు చొప్పున నగదు అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శరత్‌బాబు, ఎంపీడీవో శేఖర్‌నాయక్, రాష్ట్ర బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన శ్రీధర్, జడ్పీటీసీ ఇందుమతి, టీడీపీ



బియ్యం, నిత్యావసరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

నాయకులు పార్థసారథి, సెల్వం, బొమ్మన పళణి, పీఏసీఎస్ డైరెక్టర్లు సుధాకర్, రవి, జయపాల్, ఎఫ్‌డీవో మహిజ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు

● ఆర్డీవో కిరణ్మయి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దారు రాజేంద్ర

నాయుడుపేట టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్ఎస్ఆర్ కాలనీ రైల్వే గేట్ సమస్యపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపడుతామని సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి అన్నారు. ఎన్ఎస్ఆర్ కాలనీ రైల్వేగేట్ సమీపంలో గురువారం ఆర్డీవో ఆధ్వర్యంలో రెవెన్యూ, రైల్వే, మున్సిపల్ అధికారులతో జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశాన్ని కాలనీవాసులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ సుమారు 500 కుటుంబాలకు పైగా ఎన్ఎస్ఆర్ కాలనీలో 78వ రైల్వే గేట్ ద్వారానే రాకపోకలు సాగిస్తూ ఉండేవారమని, ఎటువంటి సమాచారం లేకుండా ఉన్న రైల్వే గేట్‌ను మూసివేయడంతో నానాఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. సుమారు 5 కిలోమీటర్ల మేర ప్రయాణించి పట్టణానికి చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొందని, ఇకనైనా రైల్వేగేట్‌ను పునరుద్ధరించాలని ఆర్డీవో ఎదుట వారు మొరపెట్టుకున్నారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ సమస్యలన్నీ ఉన్నతాధికారులకు నివేదిస్తామని, వారి ఆదేశాల మేరకు చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు రాజేంద్ర, మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, రైల్వే పీడబ్ల్యూడీ నజీర్, ఎస్ఐ ఆదిలక్ష్మి, రైల్వే పోలీసులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు కూరగాయల పంపిణీ



కూరగాయలు అందజేస్తున్న టీడీపీ నాయకుడు సూర్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు

చిల్లకూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలబల్లిరెట్టపల్లి గ్రామంలో తుఫాన్ కారణంగా ఇబ్బందులు పడుతున్న ఎస్టీకాలనీవాసులకు గురువారం స్థానిక టీడీపీ నాయకుడు మన్నే సూర్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో కూరగాయలు అందజేశారు. సూర్యనారాయణ మాట్లాడుతూ మొంథా తుఫాన్ కారణంగా ఎస్టీకాలనీవాసులు ఇబ్బందులు పడుతుండడంతో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, టీడీపీ సీనియర్ నేత తానంకి నానాజీ, టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి సూచనల మేరకు కూరగాయలను అందజేసినట్లు తెలిపారు. అబ్దుల్‌రెహమాన్, అన్వేష్, రమేష్, చంద్ర, సాయిరామ్, సుబ్రమణ్యం, మధు తదితరులు పాల్గొన్నారు

● గూడూరు అర్బన్: మండలంలోని దివిపాళెం, విందూరు గ్రామాల్లో, చిల్లకూరు మండలంలోని ఓడూరు, రెట్టపల్లి, కృష్ణపురం గిరిజనకాలనీ, తమ్మినపట్నం గ్రామాల్లో గురువారం గూడూరు ఏఎంసీ చైరపర్సన్ చిల్లకూరు నీరజ ఆధ్వర్యంలో తుఫాన్ బాధితులకు ఉల్లిపాయలు, ఉల్లగడ్డలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, సోమిశెట్టి చెంచురామయ్య, వేముల సునీల్, రాజేంద్ర, జగదీష్ బాబు, వేమచంద్రవర్మ, లక్ష్మీ, వెంకయ్య, రవీంద్రరెడ్డి, వెంకటరమణయ్య, శేషయ్య, యశ్వంత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● డక్కిలి: మండలంలోని చావలపల్లి గ్రామంలో తుఫాన్ బాధితులకు గురువారం డిప్యూటీ తహసీల్దారు ప్రసన్నరాణి, ఎంపీపీ గోను రాజశేఖర్ ఆధ్వర్యంలో నిత్యావసరాలను పంపిణీ చేశారు. డీటీ ప్రసన్నరాణి మాట్లాడుతూ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వం ప్రతి కుటుంబానికి 25 కిలోల బియ్యం, లీటరు వంటనూనె, కేజీ చక్కెర, పప్పు, బంగాళాదుంపలు అందించినట్లు తెలిపారు. రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరి నారుమడులకు తక్కువ మోతాదులో ఎరువులు



వరినారుమడులను పరిశీలిస్తున్న ఏవో సుచేంద్ర ప్రసాద్

కోట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా నీటమునిగిన వరి నారుమడులకు ఎలాంటి ఢోకాలేదని, ఎరువుల వాడకం మోతాదు తగ్గించాలని వ్యవసాయశాఖ అధికారి సుచేంద్రప్రసాద్ కోరారు. మండల పరిధిలోని తిన్నెలపూడి, తాటితోపు గ్రామాల్లో నీటమునిగిన వరినారుమడులను గురువారం ఆయన పరిశీలించారు. నీటిలో ఉన్న ఎకరం నారుమడికి బూస్టర్ డోస్‌లో భాగంగా ఒకటిన్నర కేజీల పోటాషియం, 2 కేజీల యూరియాను పిచికారి చేయాలన్నారు. అదే విధంగా ఒక లీటరు నీటికి ఒక గ్రాము కాంట్రాఫ్‌ను కలిపి రెండు ఎంఎల్ కలిపి పిచికారిచేసినట్లయితే వరి నారుమడులకు ఎలాంటి చీడపీడలు సోకవన్నారు. ఆయన వెంట వ్యవసాయ విస్తరణాధికారి సాయికుమార్, పలువురు సహాయ వ్యవసాయ అధికారులు, రైతులు ఉన్నారు.

రాజ్యాంగ దినోత్సవ పోటీలకు విద్యార్థుల ఎంపిక

నాయుడుపేట టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎల్ఏసాగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలస్థాయి పోటీలను గురువారం నిర్వహించారు. వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలను నిర్వహించి, ప్రతి విభాగం నుంచి ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేశారు. వారికి మరలా క్విజ్ పోటీలు నిర్వహించి, నియోజకవర్గస్థాయి పోటీలకు ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు మునిరత్నం, మాధవి, ప్రధానోపాధ్యాయురాలు మీనాకుమారి, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, చెంచుకుమార్, సుభాష్, జి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన పోటీలు

డక్కిలి, అక్టోబర్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎనిమిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలను గురువారం నిర్వహించారు. మండల స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా సన్మానించి, బహుమతులు అందచేశారు. వీరిని డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎంఈవో వెంకటేశ్వర్లు, జగదీష్‌బాబు తెలిపారు.

ఘనంగా గోపాష్టమి వేడుకలు

వెంకటగిరిటౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దంపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోపాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం గోవులకు పూజలు నిర్వహించారు. అనంతరం విశ్వహిందూపరిషత్ ప్రఖండ అధ్యక్షుడు వెంకటశాస్త్రి మాట్లాడుతూ కార్తీకమాసంలో గోపూజ, గోదానం, గోసేవ కార్యక్రమాలు ఎంతో విశిష్టమైనవన్నారు. గోవులలో ముక్కోటిదేవతల ప్రతిరూపాలు ఉంటాయన్నారు. చిన్నతనం నుంచే పిల్లలకు గోవు విశిష్టను తెలియజేయాలన్నారు. మల్లికార్జున్, తులసీరామ్, హనుమంతు, ఋషి, శ్రీనివాసులు, రవి, రవీంద్ర, మురగయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్యకళాశాలల ప్రైవేటీకరణ వద్దు: వైసీపీ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి

ఓజిలి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వద్దని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు కోటి సంతకాల కార్యక్రమం చేపట్టామన్నారు. మండల పార్టీ కన్వీనరు పాదర్తి హరినాథరెడ్డి ఆధ్వర్యంలో ఓజిలిలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గం నుంచి 60 వేల మందితో సంతకాలు చేయిస్తామన్నారు. ఎంపీపీ అరుణమ్మ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, జిల్లా అధికారప్రతినిధి కొండూరు వెంకటసుబ్బరాజు, సీనియర్ నాయకులు కొండూరు దామోదర్‌రాజు, ప్రభాకర్ రాజు, గోపాలయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.

● పెళ్లకూరు: మండలంలోని రోసనూరులో వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ గురవారం జరిగిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా, మండల కన్వీనర్ ఓబ్బు వెంకటరత్నం, నాయకులు ఎల్లు మోహన్, సాగి జితేంద్ర, బండి బాలు, అట్ల కృష్ణ, మునిరాజ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషిచేయాలి



ఆర్ఎస్ఎస్ ఏపీ సంఘటన మంత్రి మధుకర్‌జీని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

గూడూరు, అక్టోబరు 30 (ఆంధ్ర జ్యోతి): నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేస్తూ బీజేపీ బలోపేతానికి కృషిచేయాలని ఆర్ఎస్ఎస్ ఏపీ సంఘటన మంత్రి మధుకర్‌జీ అన్నారు. గురువారం స్థానిక రైల్వేస్టేషన్‌కు విచ్చేసిన ఆయనను బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో పేదలకు చేరువ చేసేలా కష్టపడి పనిచేయాలన్నారు. పాపారెడ్డి, పురుషోత్తంరెడ్డి, ఆరికట్ల బాలకృష్ణమనాయుడు, దయాకర్, సురేష్‌బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవం

గూడూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జాతీయ ఐక్యతా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యతాదినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఐక్యతా దినోత్సవ ప్రతిజ్ఞను చేపట్టారు. డాక్టర్ పీర్‌కుమార్, కోటేశ్వరరావు, విజయమహేష్, నారాయణరాజు, శైలజ, ఝాన్సీవాణి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

సూళ్లూరుపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని బాలాజి ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులు అంజూరు సుబ్రహ్మణ్యం(60) (గోపాల్) మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం మృతి చెందారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, టీడీపీ నాయకులు ఆయన భౌతికాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

భైరవానిగుంట చెరువు బొగడకు అడ్డుకట్ట



తూము దగ్గర గండి పడిన చోట ఇసుక బస్తాలు వేస్తున్న దృశ్యం

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుక్కంబాకం భైరవానిగుంట చెరువు తూము దగ్గర పడిన బొగడకు గురువారం ఇసుక బస్తాలతో అధికారులు అడ్డుకట్ట వేశారు. నాలుగు రోజుల క్రితం కురిసిన వర్షాలకు తూము దగ్గర బొగడ పడింది. దీంతో చెరువులోని నీరంతా వృథాగా బయటకు పోయింది. అధికారుల ఆదేశాలతో వీఆర్వో ఆదిలక్ష్మి దగ్గరుండి ఇసుక బస్తాలు వేసి నీరు బయటకు పోకుండా చర్యలు చేపట్టారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

నష్టపరిహారం అందిస్తాం: టీడీపీ


ప్రజలతో మాట్లాడుతున్న నాయకులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా బాధితులకు నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తామని టీడీపీ నాయకులు తెలియజేశారు. భారీ వర్షాల వల్ల నష్టపోయిన వారితో టీడీపీ నాయకులు మాట్లాడారు. అధికారులతో మాట్లాడి కూలిన ఇళ్లకు త్వరగా ఆర్థిక సాయం అందేలా చేయాలని బాధితులు కోరారు. కోర్టు ప్రహరీ కూలే దశలో ఉందని ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని కోరారు. స్పందించిన టీడీపీ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, నాయకులు బాలు, ఢిల్లీ, రాకేష్, నవీన్, వివేక్, తుమ్మ బాల తదితరులు పాల్గొన్నారు.

నీర్పాకోటలో చెత్త తొలగింపు

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలం లోని నీర్పాకోట -సూళ్లూరుపేట రోడ్డు పక్కన ఉన్న చెత్తను సర్పంచ్ విద్యానాథరెడ్డి ఎక్స్‌కవేటర్‌తో ట్రాక్టర్ ద్వారా తరలించారు. గ్రామంలోని మిట్టదళితవాడలో చెత్త సూళ్లూరుపేట రోడ్డుకు ఇరువైపులా పేరకు పోయి అధ్వానంగా మారడంతో సర్పంచ్ పారిశుధ్య చర్యలు చేపట్టారు.

ప్రయోగాలతో విజ్ఞానం పెరుగుతుంది

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రయోగాలు చేయడం ద్వారా విద్యార్థుల్లో విజ్ఞానం పెరుగుతుందని బీఎన్ కండ్రిగ ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. మండలంలోని కనమనం బేడు ఏకలవ్య గురుకుల పాఠశాలలో విద్యార్థుల విజ్ఞానిక ప్రదర్శనను గురువారం ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన పాల్‌కాన్, ఇండోర్‌ప్లాంట్, నీటి శుద్ధి యంత్రం, కాయిన్‌బాక్స్, ఏటీఎం, పవర్ సేవింగ్ సిస్టమ్, యూజ్ ఆఫ్ నానో టెక్నాలజీలు ఎంతోగానో ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ ధర్మేంద్రసింగ్ గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ హరిప్రసాద్, ఎంఈవో రవీంద్రనాథ్, పీఎస్ఐ సుధీర్‌రెడ్డి, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ



ఏర్పేడు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పాపానాయుడుపేట జడ్పీ ఉన్నత పాఠశాలకు 1974-75 పూర్వవిద్యార్థుల బృందం రూ.41 వేలు విలువ చేసే స్పీకర్ బాక్సులు, మైకు, అంప్లిఫయర్‌ను వితరణ చేశారు. పూర్వవిద్యార్థుల తరపున తంబా సుబ్రహ్మణ్యం ప్రధానోపాధ్యాయులు మారయ్యకు అందజేశారు. లక్ష్మీపతి, చెంచుకృష్ణ పిళ్లై, దామోదరరెడ్డి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

డిజిటల్ మార్కెటింగ్ వెబ్‌సైట్ ప్రారంభం

శ్రీకాళహస్తి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తికి చెందిన కొంతమంది ముస్లిం యువత డిజిటల్ మార్కెటింగ్ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. వెబ్‌సైట్‌ను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం యువత ఉపాధి కల్పనకు ఎంతో కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగానే గూగుల్ డేటా సెంటర్ వైజాగ్‌కు తీసుకొచ్చిందన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌కు ఎమ్మెల్యే సుధీర్ పరామర్శ

శ్రీకాళహస్తి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కాపుగున్నేరి పీఏసీఎస్ చైర్మన్ వంకాలయపాటి బత్తిరెడ్డి సోదరి వాకా మంగమ్మ ఇటీవల మరణించారు. గురువారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి శ్రీకాళహస్తి మండలం చల్లపాళెంకు చేరుకుని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులుఅర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.

మేక్ ఏ థాన్ వర్క్‌షాప్‌లో సిద్ధార్థకు ద్వితీయ బహుమతి



నారాయణవనం, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని మిట్స్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన 'మేక్ ఎథాన్ వర్క్ షాప్' పోటీల్లో పుత్తూరులోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. టైటాన్, ఇన్ఫునిటీ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీఎస్ఈ విభాగానికి చెందిన విద్యార్థులు కుమార్, మాధురి, ఉదయ్‌కిరణ్‌రెడ్డి, ఆదిల్ కలిసి రూపొందించిన కైకో-శెన్ అనే ప్రాజెక్టుకు ద్వితీయ బహుమతి లభించింది. ఈ ప్రాజెక్టు ద్వారా సిల్క్ వర్క్ కోకూన్ల లింగాన్ని ఆటోమేటిక్‌గా గుర్తించే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేశారు. ఇది రైతులకు ఎంతో ఉపయోగకరమని నిర్వాహకులు పేర్కొన్నారు. న్యాయనిర్ణేతలు ప్రాజెక్టును ప్రశంసించారు. రూ.7000 నగదు బహుమతి అందజేశారు. విజేతలను కళాశాల సీఎస్ఈ కో-ఆర్డినేటర్ రవికుమార్, ఫ్యాకల్టీ సభ్యులు మనివాసగమ్, మురళి, ప్రిన్సిపాల్ మధు, జనార్దన్ అభినందించారు.

పుత్తూరు వార్తలు

శాస్త్రోక్తంగా ప్రసన్న వెంకటేశ్వరుడి కల్యాణం



వడమాలపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వరుని ఆలయంలో గురువారం శ్రీవారి కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా వేదమంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. శ్రీవారి జన్మ నక్షత్రమైన శ్రవణం సందర్భంగా కల్యాణం నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. పద్మావతి, ఆండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామివారిని పట్టు పీతాంబరాలు, పుష్పాలతో అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు సూర్య కుమారాచార్యుల ఆధ్వర్యంలో గణపతి, అగ్నిహోమం నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, భక్తుల గోవింద నామ స్మరణల నడుమ వేదమంత్రాలతో మంగళ్యధారణ చేయించారు. మహామంగళ హారతులిచ్చారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వరిపంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు

వడమాలపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాయంపేట, వేమాపురం, తిరుమణ్యం గ్రామాల్లో వరిపంటను జిల్లా వనరుల కేంద్రం, వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు క్షేత్ర స్థాయిలో గురువారం పరిశీలించారు. రాస్ కృషి విజ్ఞాన కేంద్రం, ఉద్యాన శాస్త్రవేత్తలు డా.శ్రీనివాసులు, పి. ఎస్ సుధాకర్ వరి, మిరప రైతులకు పలు సూచనలు చేశారు. వర్షాలకు పడిపోయిన వరి పంటకు ఉప్పు ద్రావణం పిచికారి చేయాలని సూచించారు. ముంపునకు గురైన మిరప, బెండ తోటలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్ర కో-ఆర్డినేటర్, సౌభాగ్య లక్ష్మి, వ్యవసాయాధికారి వేణుగోపాల్, మండల వ్యవసాయ అధికారి విజయకుమార్, రైతులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువైన మేథో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు చేశారు. స్వామివారికి అభిషేకం జరిపించారు. పలు హారతులు ఇచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు.

ఉచిత టైలరింగ్ శిక్షణప్రారంభం

రేణిగుంట అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాస్ జన శిక్షణ సంస్థ, బాలాజీ బాల వికాస్ సంయుక్తంగా మహిళలకు మూడు నెలలు ఉచిత టైలరింగ్ శిక్షణా తరగతులు ప్రారంభించారు. గురువారం మండల పరిధిలోని సూర్యనారాయణపురంలో మొదలైన ఈ శిక్షణను డైరెక్టర్ డాక్టర్ మోహన్, బాలాజీ బాల వికాస్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ సుధాకర్‌రెడ్డి, శిక్షకులు తేజవతి పాల్గొన్నారు.

నిత్యావసరాల వితరణ



నారాయణవనం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అరణ్యంకండ్రిగ పంచాయితీ సుబ్బానాయుడు కండ్రిగకు చెందిన కుప్పయ్య కుమారుడు మేస్త్రీ పనులు చేస్తూ గాయపడి మంచానికి పరిమితమయ్యారు. మండలంలోని జై బీమ్ ఫౌండేషన్ వారు గురువారం ఆయన ఇంటికి వెళ్లి నిత్యావసరాలు అందించారు. ఈ కార్యక్రమంలో జైబీమ్ ఫౌండేషన్ రాజ్‌కుమార్, సభ్యులు గుర్రప్ప, వెంకటరామయ్య, పరంధామన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పంట పురుగులపై అప్రమత్తంగా ఉండాలి

నారాయణవనం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుపాను కారణంగా కురిసిన వర్షంతో పంటల్లో ఏర్పడిన తెగులు, పిండి పురుగుల నివారణకు మందులను పిచికారి చేసి నివారించవచ్చని తిరుపతి ఉద్యాన పరిశోధన శాస్త్రవేత్తలైన సంచాలకులు డాక్టర్. రూత్, శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని జీఎన్ కండ్రిగలో పొలాలను పరిశీలించారు. సంపంగి, రోజా తోటలను పరిశీలించి మచ్చతెగులు ఉన్నట్లు గుర్తించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ హార్టికల్చర్ అసిస్టెంట్ శాలిని, కవిత, రైతు శాస్త్రవేత్త మణికంఠ, రైతులు మోమన్, బాలాజీ రాంబాబు తదితరులు ఉన్నారు.

అక్షరాస్యత పెంపొందిస్తాం : ఏపీఎం

నారాయణవనం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అక్షరాంధ్ర ఉల్లాస్ ద్వారా అక్షరాస్యత పెంపొందిస్తామని ఏపీఎం ధనంజయరెడ్డి పేర్కొన్నారు. గురువారం నారాయణవనంలో అక్షరాంధ్ర ఉల్లాస్ వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ధనంజయ రెడ్డి మాట్లాడుతూ మహిళలకు డిజిటల్ లిటరసీపై పూర్తి అవగాహన కల్పించాలని తెలిపారు. నవంబరు 1న ఈ కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో ప్రారంభిస్తామన్నారు. అలాగే నిరక్షరాస్యులకు ఇచ్చేందుకు వలంటీర్లకు మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ ఆదిల్‌బాషా, సీసీలు నాగేంద్ర, అరుణ్, నిమ్మి, రాజేశ్వరి పాల్గొన్నారు.

వేడుకగా శ్రవణోత్సవం



నారాయణవనం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నారాయణవనంలో పద్మావతీ సమేత కళ్యాణ వెంకటేశ్వరుడి ఆలయంలో గురువారం సాయంత్రం ఉభయ నాంచారులతో కల్యాణ వెంకన్న తిరుచ్చి వాహనంలో మాడవీధుల్లో విహరించారు. ఉదయం స్వామి, అమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యపూజలు నిర్వహించారు. ప్రత్యేక పుష్పాలతో, స్వర్ణాభరణాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణం సందర్భంగా ప్రత్యేక అర్చనలు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్నతిరుచ్చి వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఆలయ అధికారి నాగరాజు అర్చకులు శ్రీధర్ భట్టా చార్యులు, శ్రీనివాస భట్టా చార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మోహన్‌బాబును కలిసిన కోలా విశాలాక్షి



శ్రీకాళహస్తి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటుడు మంచు మోహన్‌బాబును గురువారం ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యురాలు కోలా విశాలాక్షి మర్యాదపూర్వకంగా కలిశారు. ఇంటర్నేషనల్ డ్రైవింగ్ లైసెన్సు కోసం ఆయన గురువారం ఆర్టీవో కార్యాలయానికి వచ్చారు. ఈ నేపథ్యంలో విశాలాక్షిని సత్కరించారు.

బాబు పాలనాదక్షత రాష్ట్రానికి వరం: శంకర్‌రెడ్డి


నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న శంకర్‌రెడ్డి

సత్యవేడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు పాలనాదక్షత రాష్ట్రానికి వరం లాంటిదని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రాజగోపాలపురం పంచాయతీ బాలగోపాలపురంలో పలువురు వరద బాధిత గిరిజన కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గిరిజనులు తమ సమస్యలను శంకర్‌రెడ్డికి విన్నవించుకున్నారు. కాలనీలో నివసిస్తున్న చాలామందికి సరైన ఆధార్ కార్డులు లేవన్నారు. ఒకే ఇంట్లో ఇద్దరు ముగ్గురు నివసిస్తున్నామని ఇంటి స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని కోరారు. కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ విజయలక్ష్మి, సురుటుపల్లె ఆలయ చైర్మన్ పద్మనాభరాజు, నాయకులు శివకుమార్, సతీష్‌నాయుడు, చిన్న, బాలరాజు, చక్రపాణిరెడ్డి, జనసేన రూపేష్‌కుమార్ పాల్గొన్నారు.

అదునులో వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేయండి


విత్తనాలు పంపిణీ చేయలేదని ప్రశ్నిస్తున్న సర్పంచ్ మనోహర్

పిచ్చాటూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అదునులో రైతులకు వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేయాలని ఎస్ఆర్ఎబీ పేట సర్పంచ్ మనోహర్ కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ మీటింగ్ హాలులో ఎంపీపీ రేఖ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. త్రీ ఫేజ్ నిరంతర విద్యుత్ మార్చి, ఏప్రిల్ కల్లా అన్ని గ్రామాల్లో అందుబాటులో ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ సుబ్రహ్మణ్యం రెడ్డి తెలిపారు. వెలుగు, ఎన్ఆర్ఈజీఎస్‌లో సభ్యులుగా ఉన్న వారు వారి బ్యాంకు ఖాతా ల్లో ఎప్పుడూ రూ.500 నిల్వ ఉంచితే అనుకోని దుర్ఘటనలు జరిగినప్పుడు రూ.రెండు లక్షలు బీమా పొందవచ్చునని ఏపీఎం నాగభూషణం తెలిపారు. వైస్ ఎంపీడీవో రవి మాట్లాడుతూ దాతలు స్థలాలు ఇస్తే పంచాయతీ భవనాలు నిర్మించు కోవచ్చునన్నారు. సర్పంచ్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామ కంఠం భూముల్లో అక్రమంగా కట్టడాలు నిర్మిస్తున్నారని తెలియజేశారు. పొజిషన్ సర్టిఫికెట్ అందించిన అర్హులైన లబ్ధిదారులు హౌసింగ్ పొందవచ్చునని హౌసింగ్ ఏఈ బాలాజీ అన్నారు. అరణియార్ తూముల నుంచి నిరంతరం నీరు ప్రవహిస్తూ ఉంటే ఆ పరిసర భూములు చౌడు భూములవుతాయని పంట కోత తరువాత నీళ్లు ఆపేస్తే మంచిదని వ్యవసాయ అధికారి సంజీవరెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో మహ్మద్‌రఫీ, తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ఏవో శివయ్య, ఎంపీటీసీలు సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు. కాగా ప్రజాప్రతినిధుల సీట్లు ఖాళీ కుర్చీలతో దర్శనమిచ్చాయి.

వీరభద్రుడి బాలాలయ వేడుకలో ఎమ్మెల్యే

నారాయణవనం, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): మండలంలో కొలువైన టీటీడీ అనుబంధ ఆలయమైన భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయ బాలాలయ వేడుకలో సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, జడ్పీటీసీ సుమన్ కుమార్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ నిర్మాణ పనులు వేగవంతంగా, నాణ్యతతో చేపట్టాలని సూచించారు. అలాగే తామరగుంటలో కొలువైన నాగలమ్మ అమ్మ వారి ఆలయ ప్రహరీ నిర్మాణానికి టీటీడీకి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణవనం సర్పంచ్ కుమారులు రామన్, లక్ష్మన్, మాజీ సర్పంచ్ కేఎస్.రవి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఊరప్ప, టీడీపీ నాయకులు గోవిందస్వామి, సుధా, బాలమురగన్ కుమార్, దేవరాజులు, సుబ్రహ్మణ్యం, మురళి, బాలయ్య, యువరాజు, ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి నిధులు సమకూర్చుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలకు వివిధ మార్గాల ద్వారా నిధులు సమకూర్చుకోవాలని ఎంపీడీవో వెంకటరత్నమ్మ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులతో పంచాయతీ నిధులు ఎలా సేకరణపై గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భగా ఆమె మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వంపై ఆధారపడకుండా వివిధ మార్గాల ద్వారా నిధులు సేకరించాలన్నారు. తడి, పొడి చెత్తతో ఎరువులను తయారు చేసి అమ్మితే నిధులు వస్తాయన్నారు. వివిధ పన్నుల ద్వారా ఆదాయం సమకూర్చుకుని పంచాయతీలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్య క్రమంలో రిసోర్సు పర్సన్‌లు చిరంజీవి, హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎన్జీవో నూతన కార్యవర్గం ఎన్నిక


ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

సత్యవేడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నాన్ - గెజిటెడ్, గెజిటెడ్ ఆఫీసర్స్ (ఏపీఎన్‌జీవో) అసోసియేషన్ సత్యవేడు తాలూకా యూనిట్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం సత్యవేడులోని స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఎన్నికల అధికారి జనార్ధనయ్య ఆధ్వర్యంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఎన్నికలకు నామినేషన్లను స్వీకరించారు. పీ.యూసఫ్ ఖాన్, శామ్యూల్ ప్యానల్‌ల తరఫున 11 పోస్టులకు గాను 11 నామినేషన్‌లు దాఖలయ్యాయి. దీంతో ఎన్నికల అధికారి జనార్ధనయ్య వీరిని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఏపీఎన్‌జీవో అసోసియేషన్ సత్యవేడు తాలూకా యూనిట్ అధ్యక్షుడిగా పీ. యూసఫ్‌ఖాన్, సహాధ్యక్షుడిగా డీ.లీలామాధవ్, ఉపాధ్యక్షులుగా ఎన్.గవాస్కర్, సీ.నాగరాజు, కే.ఎం. మాలతి, కార్యదర్శిగా కే.శ్యామ్యూల్, సహాయ కార్యదర్శులుగా కే.ఏ.త్యాగరాజు, ఏ.వినోద్, కే.నాగేంద్ర, సహాయ కార్యదర్శి ఎస్.స్వర్ణ, ట్రెజరర్‌గా ఆర్.మల్లికార్జునరావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి జిల్లా అడ్‌హక్, ఏపీఎన్‌జీవో చైర్మన్ సురేష్‌బాబు, ట్రెజరర్ బొప్పన లలిత్ కుమార్ హాజరై నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు.


వరదబాధితులకు అండగా ప్రభుత్వం : ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వరదబాధితులకు అన్ని విధాలుగా ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. మండలంలోని దాసుకుప్పంలో వరదబాధితులకు గురువారం ప్రభుత్వం తరపున రూ. వెయ్యి, 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ప్రభుత్వం ఎప్పుడూ ప్రజలకు అండగా ఉంటుందని తెలియజేశారు.

ఆదుకోవాలని చేనేతల వినతి

వరదయ్యపాళెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన తమ కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా సాయం అందించి ఆదుకోవాలని చేనేత కార్మికులు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుధీర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా చేనేత సంఘం నాయకుడు బుర్రా కృష్ణమూర్తి మాట్లాడుతూ మండలంలోని వరదయ్యపాలెం, గోవర్ధనపురం, పద్మావతిపురం, సీఎల్ఎన్‌పల్లె, మరదవాడ, కంచరపాళెం, బీఎస్‌పేట, కారిపాకం తదితర గ్రామాలలో వర్షాల కారణంగా మగ్గాల గుంటల్లో నీరు చేరి నూల, పట్టు, జరీ, డిజైన్ అట్టలు తడిసి పనికి రాకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆటో ఢీకొని ద్విచక్రవాహనదారుడు మృతి


మృతిచెందిన వెంకట రమణయ్య

రేణిగుంట అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆటో ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. అర్బన్ పోలీస్ స్టేషన్ రైటర్ చలపతి కథనం మేరకు.. గురువారం ఉదయం శ్రీకాళహస్తి మండలం కలవగుంట ఎస్టీ కాలనీకి చెందిన వెంకటరమణయ్య (38) తన స్నేహితుడు గంగాధరంతో కలిసి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా వేదాలచెరువు జాతీయ రహదారిపై వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన ఆటోఢీకొంది. వెంకటరమణయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మధ్యాహ్నం మృతిచెందాడు. కేసు నమోదు చేశారు.

ముక్కంటి సేవలో ఎంపీ సీఎం రమేష్

శ్రీకాళహస్తి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం ఎంపీ సీఎం రమేష్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద వారికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దంపతులు, ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.


ఆలయం వద్ద ఎంపీ సీఎం రమేష్

3న సురుటుపల్లి ఆలయ ధర్మకర్తల మండలి సమావేశం


చైర్మన్ పద్మనాభరాజు

నాగలాపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సురుటుపల్లి పల్లికొండేశ్వర ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుల ఆత్మీయ సమావేశం నవంబరు 3వ తేదీ నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పద్మనాభరాజు వెల్లడించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ సమావేశానికి నియోజక వర్గ టీడీపీ కార్యక్రమాల సమన్వయకర్త కూరపాటి శంకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ మాడవీధుల్లో సిమెంటు రోడ్డు నిర్మాణం, కోనేరు నిర్మాణం పూర్తి చేయడంపై చర్చించి తీర్మానాలు చేయనున్నట్లు సమాచారం.

అభివృద్ధికి కృషిచేద్దాం

పిచ్చాటూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా మండల అభివృద్ధికి కృషిచేద్దామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపు నిచ్చారు. గురువారం ఉదయం పిచ్చాటూరు ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ద్వారా మండలంలోని పంచాయతీలకు రూ.20 లక్షల చొప్పున మంజూరైన నిధులు, చేపట్టదలచిన పనుల వివరాలను ఎంపీడీవో మహ్మద్‌రఫీని అడిగి తెలుసు కున్నారు. ప్రస్తుతం నిధులు విడుదలైన వేలూరు, నీరువాయి పంచాయతీలలో పనులు త్వరగా చేపట్టాలని సూచించారు. ఇల్లులేని వారికి పట్టాలు పంపిణీ చేయాలని తహసీల్దార్ సుబ్రహ్మణ్యంను కోరారు. గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.

రైతుల సేవే పరమావధి

పిచ్చాటూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రైతుల సేవే పరమావధిగా పీఏసీఎస్ ముందుకెళుతుందని పిచ్చాటూరు సింగిల్ విండో చైర్మన్ జయచంద్రనాయుడు తెలిపారు. గురువారం స్థానిక పీఏసీఎస్ ఆవరణలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి ఉన్న ప్రతి రైతు సహకార సంఘంలో సభ్యుడిగా ఉంటూ సంస్థ బలోపేతానికి సహకరించాలని కోరారు. ఎకరా ఉన్న రైతుకు రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రుణ సౌకర్యం అందిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో బ్యాంకు మేనేజర్ శరవణ కుమార్, పీఏసీఎస్ సీఈవో దొరస్వామి, టీడీపీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆడిటోరియం ప్రారంభం


రిబ్బన్ కట్ చేసి ఆడిటోరియాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నాగలాపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నాగలాపురం జడ్పీ హైస్కూలు ఆవరణలో నూతనంగా నిర్మించిన ఆడిటోరియాన్ని గురువారం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు ప్రార్థన చేయడానికి, మధ్యాహ్నం భోజనం చేయడానికి ఇతర కార్యక్రమాల కోసం ఈ ఆడిటోరియాన్ని నిర్మించామని తెలిపారు. ఈ కార్యక్రమం లో తహసీల్దార్ హనుమాన్‌నాయక్, ఎంపీడీవో బాలాజీనాయక్, హెచ్‌ఎం కస్తూరయ్య, టీడీపీ నాయకులు మురళి, అన్సు పాల్గొన్నారు.